
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కర్నూలు
జిల్లా వార్తలు 5
బుధవారం 30 జూలై 2025

ఇలాగైతే ఎలా?


జలాశయం నుంచి కుడి కాలువకు నీటిని విడుదల చేసే తూములు ఇవి. సామర్థ్యం 673 క్యూసెక్కులు

- పందికోన జలాశయం తూము సామర్థ్యంలో భారీ తేడా
- ఇన్‌లెట్ తూము సామర్థ్యం 428 క్యూసెక్కులే
- కుడి, ఎడమ కాలువల సామర్థ్యం 816 క్యూసెక్కులు
- 388 క్యూసెక్కుల మేర తేడా
- పూర్తి ఆయకట్టుకు సాగునీరు అసాధ్యమే
- డిజైన్ లోపం వల్ల రైతులకు తప్పని ఇక్కట్లు

ఏ జలాశయం నుంచి అయినా సరే కాలువలకు ఎంత పరిమాణంలో సాగునీటిని విడుదల చేస్తారో.. అంతకంటే ఎక్కువగా నీరు రిజర్వాయరులో చేరేలా తూములు (ఇన్‌లెట్ స్లూయిస్) ఏర్పాటు చేయాలి. అప్పుడే నిండుకుండలా కళకళలాడుతుంది. పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడం సాధ్యం అవుతుంది. కుడి, ఎడమల కాలువల సామర్థ్యంలో సగం నీటిని కూడా విడుదల చేయలేని తూముల వల్ల సాగు సాధ్యమేనా..? అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ఒకటి రెండు తడులపైనా పంటలకు ఇవ్వడం సాధ్యం అవుతుందా..? అంటే ఆసాధ్యమేనని సాగునీటి నిపుణులు సమాధానం ఇస్తున్నారు. పత్తికొండ(పందికోన) జలాశయం తాజా పరిస్థితి ఇది. ఇన్‌లెట్ (జలాశయం నింపే తూము) సామర్థ్యం 428 క్యూసెక్కులు అయితే 65 వేల ఎకరాలకు సాగునీరు అందించే కుడి, ఎడమ కాలువల తూములు (అవుట్‌లెట్ స్లూయిస్) సామర్థ్యం 816 క్యూసెక్కులు. ఇన్‌లెట్, అవుట్‌లెట్ మధ్య 388 క్యూసెక్కులు భారీ తేడా ఉంటే జలాశయం నింపేది ఎలా..? ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేది ఎలా..? డిజైన్ లోపం రైతులకు శాపంగా మారింది. హంద్రీనీవా విస్తరణలో భాగంగా అదనపు తూములు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉన్నా.. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు పంపించాలనే ఇంజనీర్లు లక్ష్యం ముందు కరువు రైతుల సాగునీటి డిమాండ్ చిన్నబోయింది.

కర్నూలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం ఎగువన 40 టీఎంసీలు కృష్ణా వరద జలాలు ఎత్తిపోసి రాయల సీమలోని ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగు, 35 లక్షల జనాభాకు తాగునీరు అందించాలనే ఆశయంతో హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం నిర్మించారు. తొలి దశ (ఫేజ్-1)లో నంద్యాల జిల్లా మాల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కి.మీలు ప్రధాన కాలువ, జిల్లాలో కృష్ణగిరి, పత్తికొండ జలాశయాలు, అనంతపురం జిల్లాలో జీడిపల్లి రిజర్వాయరు నిర్మించారు. ఉమ్మడి జిల్లాలో 8 టీఎంసీలు వినియోగించుకుని 80 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. అందులో ప్రధాన కాలువ కింద 13,500 ఎకరాలు, కృష్ణగిరి జలాశయం కుడి, ఎడమ కాలువల కింద 5,100 ఎకరాలు, పత్తికొండ జలాశయం కుడి, ఎడమ కాలువల కింద 61,400 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. ఆయకట్టు, తాగునీరు, నీటి ఆవిరి పరిగణలోకి తీసుకొని రిజర్వాయర్‌లోకి నీటిని వదిలే తూములు (ఇన్‌లెట్), జలాశయం నుంచి కాలువలకు సాగునీరు విడుదల చేసే తూములు (అవుట్ లెట్) సమాన సామర్థ్యం ఉండేలా నిర్మాణం చేయాలని నిపుణులు పేర్కొంటున్నారు.

డిజైన్ లోపం.. రైతులకు శాపం

పత్తికొండ జలాశయం సామర్థ్యం 1.126 టీఎంసీలు. కుడి కాలువ (లెఫ్ట్ కెనాల్) కింద 10,774 ఎకరాల ఆయకట్టు ఉంది. 143 క్యూసెక్కులు (4.05 క్యుమెక్స్) సామర్థ్యంతో తూము (అవుట్‌లెట్ స్లూయిస్) నిర్మించారు. ఎడమ కాలువ (రైట్ కెనాల్) కింద పత్తికొండ, దేవనకొండ మండలాల్లో 50,636 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ కాలువకు 673 క్యూసెక్కులు (19.081 క్యుమెక్స్) ప్రవాహ సామర్థ్యంతో తూము (అవుట్‌లెట్ స్లూయిస్) ఏర్పాటు చేశారు. అంటే కుడి, ఎడమ కాలువల కింద 61,400 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 816 క్యూసెక్కులు నీటిని విడుదల చేయాల్సి ఉంది. అదే సామర్థ్యం లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యంతో హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి జలాశయంలోకి నీటిని విడుదల చేసేలా తూము (ఇన్‌లెట్ స్లూయిస్) ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ డిజైన్ లోపం వల్లనో, మరేఇతర కారణంగానో ఇంజనీర్లకే తెలియాలి. కేవలం 428 క్యూసెక్కులు (12.14 క్యుమెక్స్) సామర్థ్యంతో ఇన్‌లెట్ తూము నిర్మించారు. దీంతో కాలువల ద్వారా ఆయకట్టుకు ఇస్తున్న సాగునీటి కంటే జలశయంలోకి విడుదల చేసే నీటిలో 388 క్యూసెక్కులు కోత పడుతుంది. ఫలితంగా ఆయకట్టుకు సాగునీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

ప్రస్తుతం కుడి, ఎడమ కాలువలు, పంట కాలువలు అసంపూర్తిగా ఉండడంతో 19-20 వేల ఎకరాలకు మించి సాగునీరు ఇవ్వలేని పరిస్థితి ఉంది. ఈ నెల 17న హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల సమయంలో పత్తికొండ జలాశయం కుడి, ఎడమ కాలువల అసంపూర్తి పనులు ప్రథమ ప్రాధాన్యతగా చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనులు పూర్తి చేస్తే.. మొత్తం ఆయకట్టుకు సాగునీరు ఇవ్వలేని పరిస్థితి ఉంది.


అసంపూర్తిగా జలాశయం రాతిపరుపు (స్టోన్ రివిట్మెంట్) పనులు

అదనపు తూము ఏర్పాటుకు నిధులు మంజూరు

పత్తికొండ జలాశయం ఇన్‌లెట్ సామర్థ్యం 428 క్యూసెక్కులు (12.14 క్యుమెక్స్)కు డిజైన్ చేశారు. దీంతో ఆయకట్టు రైతులకు కన్నీటి కష్టాలు తప్పవు. కుడి, ఎడమల కాలువల సామర్థ్యం 816 క్యూసెక్కులకు సమానంగా నీటిని తీసుకోవడానికి వీలుగా ప్రస్తుతం ఉన్న ఇన్‌లెట్ పక్కనే 388 క్యూసెక్కులు (10.99 క్యుమెక్స్) సామర్థ్యంతో మరో అదనపు తూము (అడిషినల్ ఇన్‌లెట్) ఏర్పాటుకు ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. హంద్రీనీవా కాలువ విస్తరణలో భాగంగా ఈ అదనపు తూము కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ పనులు ప్యాకేజీ-2 కాంట్రాక్ట్ సంస్థ వీపీఆర్-డీఎస్ఆర్ (జాయింట్ వెంచర్) చేయాల్సి ఉంటే.. కుప్పంకు కృష్ణా జలాలు తీసుకువెళ్లాలనే లక్ష్యంతో ప్రధాన విస్తరణ పనులు చేశారే తప్పా పత్తికొండ జలాశయం ఇన్‌లెట్ అదనపు తూము నిర్మాణం చేయలేదు.

మిగతా 6వ పేజీలో


పత్తికొండ (పందికోన) జలాశయానికి హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని విడుదలకు ఏర్పాటు చేసిన తూము (ఇన్‌లెట్) ఇది. సామర్థ్యం 428 క్యూసెక్కులే

స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం

- ఇద్దరు అభ్యర్థుల నామినేషన్లు ఉపసంహరణ
- ఆగస్టు 1న నియామక పత్రాల అందజేత



కర్నూలు న్యూసిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఏడుగురు వైసీపీ కార్పొరేటర్లు నామినేషన్లు వేశారు. ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ఇద్దరు వైసీపీ అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఐదుస్థానాలకు ఐదుగురే బరిలో ఉండటంతో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. ఆగస్టు 1వ తేదీన ఏకగ్రీవం అయిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. 28వ వార్డు కార్పొరేటర్ ఇ.నారాయణరెడ్డి, 34వ వార్డు కార్పొరేటర్ వై.వెంకటేశ్వర్లు, 39వ వార్డు కార్పొరేటర్ సీహెచ్.సాంబశివరావు, 43వ కార్పొరేటర్ కురువ మునెమ్మ, 50వ వార్డు కార్పొరేటర్ ఎస్‌టీ.షేక్ అహ్మద్ ఎన్నికయ్యారు. 26వ వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి, ఒకటో వార్డు కార్పొరేటర్ షాషాలి నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలుచేయండి

- గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగ్‌లు వాడండి
- ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై చర్యలు తీసుకుంటాం
- కలెక్టర్ రంజిత్‌బాషా


మాట్లాడుతున్న డాక్టర్ పి.కృష్ణయ్య

కర్నూలు కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, రిటైర్డు ఐఏఎస్ అధికారి డా.పి.కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేదంపై కలెక్టర్ రంజిత్‌బాషాతో కలిసి స్టేక్ హోల్డర్ విభాగాలతో కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఎక్కువ జనాభా ఉండే ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకానికి ప్రత్యామ్నాయంగా గుడ్డసంచులు, జ్యూట్ బ్యాగులు అమ్మేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో అక్టోబరు 2వ తేదీ నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్‌రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఆపరేషన్ టీ132ఎఫ్

- నల్లమలలో పులి రక్షణకు రెస్క్యూ ఆపరేషన్
- ఉచ్చుకు చిక్కి గాయపడ్డ పులికి శస్త్ర చికిత్స
- 21రోజుల పాటు మూడు బృందాలు రేయింబవళ్లు గస్తీ
- డాక్యుమెంటరీ విడుదల చేసిన ఎన్ఎస్‌టీఆర్



ఆత్మకూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): 2025 జూన్ 16వ తేదీ.. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని నాగలూటి రేంజ్ పరిధిలోని ఇన్‌ఫ్రారెడ్ కెమెరా ట్రాప్స్‌ను రెగ్యులర్ మానిటరింగ్‌లో భాగంగా పరిశీలించగా సుద్దగుంట ప్రాంతంలోని ఓ కెమెరాలో ఓ పెద్దపులి మెడ భాగంలో తీవ్రంగా గాయపడి తల్లడిల్లుతున్నట్లు గుర్తించారు. గతంలో జరిగిన ఓ సంఘటన నేపథ్యంలో గాయపడిన పులిని అలానే వదిలేస్తే అది మరణించే ప్రమాదం ఉన్నట్లు అటవీ అధికారులు పసిగట్టారు. వెంటనే విషయాన్ని నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ(ఎన్‌టీసీఏ)కు సమాచారం అందించి దాన్ని పట్టుకునే ప్రయత్నం మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే ముందుగా పులి సంచార ప్రదేశాన్ని (టెరిటరీ) గుర్తించి ఆ పరిధిలో నాలుగేళ్ల కెమెరా ట్రాప్స్‌ను పరిశీలించారు. చివరికి గాయపడిన పులి టీ132ఎఫ్‌గా నిర్ధారించారు. ఆ తర్వాత పులిని బంధించి చికిత్సలు అందించాలన్న లక్ష్యంతో 'ది రెస్క్యూ టీ132ఎఫ్' ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టారు.

మూడు బృందాలుగా ఏర్పడి


విజయవంతమైన శస్త్రచికిత్స

గాయపడిన పెద్దపులిని రక్షించేందుకు ఎన్ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ కృష్ణమూర్తి, ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ వి.సాయిబాబా, శ్రీశైలం సబ్ డీఎఫ్‌వో అబ్దుల్‌రవూఫ్, బైర్లూటి రేంజ్ అధికారి కృష్ణప్రసాద్ నేతృత్వంలో మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ముందుగా గాయపడిన పులి బైర్లూటి రేంజ్ పరిధిలోని పుల్లలచెరువు, తలమడుగు సెక్షన్ ఏరియాల్లో ఎక్కువగా సంచరించినట్లు వివిధ కెమెరా ట్రాప్స్, పగ్‌మార్క్, ప్రత్యక్ష వీక్షణం ద్వారా గుర్తించారు. దీంతో ఆ రెండు ప్రదేశాల్లో పులికి ఎరగా ఒక్కో ఆవుదూడను చెట్లకు కట్టేశారు. అలాగే ఆ ప్రదేశాల్లో రేయింబవళ్లు పూర్తిస్థాయిలో మానిటరింగ్ ఉంచారు. ఇందులో ప్రత్యేకించి మత్తు ప్రయోగం చేసేందుకు నలుగురితో కూడిన ట్రాంక్ లైజర్ టీం 20మీటర్ల పరిధిలో, పులి కదలికలను గుర్తించేందుకు థర్మల్ డ్రోన్ కెమెరాలను పర్యవేక్షించే బృందం 100 మీటర్ల పరిధిలో, పులిని బంధించినట్లయితే వెంటనే దానిని రక్షించేందుకు బ్యాక్ అండ్ టీం ఒక కిమీ పరిధిలో ఉండేలా ప్రణాళిక రూపొందించారు.

ఆరోజు ఏమి జరిగిందంటే...

గాయపడిన పులిని బంధించేందుకు అంతా సిద్ధం చేశారు. అనుకున్నట్లుగానే జూలై 4వ తేదీన రాత్రి ఇసుకగుండం రస్తాలో పెద్దపులి సంచరించింది. ఆ తర్వాత మరుసటి రోజు 5వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పుల్లలచెరువు ప్రదేశంలో కట్టేసిన ఆవుదూడను చంపేసింది.

మిగతా 7వ పేజీలో

రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం

- 35 రోజులకు రూ.5.46 కోట్లు


హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

మంత్రాలయం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం మంత్రాలయం చరిత్రలోనే రికార్డుస్థాయిలో నమోదైంది. 35రోజులకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం రూ.5,46,06,555 నగదు వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, మేనేజర్, ఈఈ సురేష్ కోణాపూర్ తెలిపారు. మంగళవారం హుండీని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య లెక్కించినట్లు తెలిపారు. రూ.5,46,06,555 నగదుతో పాటు 1820 గ్రాముల వెండి, 127 గ్రాముల బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు. ఈ నెలలో 35రోజులకు రూ.5.46కోట్లు రావడం ఇదే ప్రథమం. హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో రావడంపై మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు హర్షం వ్యక్తం చేస్తూ శ్రీమఠం ఉద్యోగులు సమష్టి కృషి ఫలితంగా హుండీ రికార్డు స్థాయిలో వచ్చిందని తెలిపారు. ఈ లెక్కింపులో అనంతపురాణిక్, జేపీస్వామి, ఆడిటర్ దత్తుస్వామి, కృష్ణమూర్తి, సుజ్ఞానేంద్ర, శ్రీపాద ఆచార్, నరసింహాదేశాయ్ పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు
కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపు


మాట్లాడుతున్న పీవీఎన్ మాధవ్

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంతో పాటు విరివిగా పరిశ్రమలు స్థాపన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వెల్లడించారు. మంగళవారం ఆయన కర్నూలు జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏ.క్యాంపులోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి, రాజ్‌విహార్‌లోని స్వామివివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా మౌర్యఇన్ హోటల్‌లో బీజేపీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ అమలు పరుస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ రాయలసీమలో రత్నాలు పోయి రాళ్లసీమగా మారిందన్నారు. ఈ ప్రాంతం నుంచి ప్రధానులు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు అయినప్పటికీ అభివృద్ధి పెద్దగా జరగలేదన్నారు. కర్నూలు రాజధాని హైదరాబాదుకు, ఆ తర్వాత అమరావతికి వెళ్లిందన్నారు. దీంతో కర్నూలుకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తుంగభద్ర, కృష్ణానది జలాలు, శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత వాసులకు తాగేందుకు చుక్కనీరు కరువైందన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు లిఫ్ట ఇరిగేషన్‌లు మంజూరు చేయించి వేల ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. ప్రాజెక్టుల ఏర్పాటు, నిధుల కోసం పోరాటాలు చేస్తామన్నారు. రాయలసీమ ప్రాంతంలో వజ్రాల గనులు ఉన్నాయనీ, పరిశ్రమలు ఏర్పాటు చేసి వాటిని వెలికి తీయాలన్నారు. గతంలో దేవాలయాలను ధ్వంసం చేశారని, పోరాటాలు చేసినా నిందితులను జైళ్లకు పంపలేదన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వారిని జైళ్లలో పెట్టాలని డిమాండ్ చేశారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ బీజేపీకి బలం లేదని తక్కువ చేసి మాట్లాడితే ఊరుకుండేది లేదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నేరుగా ఆకాశం నుంచి వచ్చిన నాయకుడు కాదని, ప్రజల నుంచి పుట్టిన నాయకుడు అన్నారు. ఎన్నో కష్టాలు, నష్టాలకోర్చి రాష్ట్ర అధ్యక్ష స్థాయికి ఎదిగారన్నారు. రాష్ట్రంలో బీజేపీకి మంచి రోజులు వచ్చాయనీ, సంస్థాగత ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, సీనియర్ నాయకులు చంద్రమౌళి, రామస్వామి మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


నరసింహా రెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న మాధవ్, టీజీ వెంకటేశ్

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న ఉపకులపతి వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీలో డిగ్రీ 2, 4 సెమిస్టర్ ఫలితాలను ఇన్‌చార్జి ఉపకులపతి వెంకట బసవరావు విడుదల చేశారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)లోని ఆయన చాంబర్లో రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లుతో కలిసి మాట్లాడారు. ఏప్రిల్ 2 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన పరీక్షలకు సంబంధించి 2వ సెమిస్టర్‌లో 939కి 532మంది, 4వ సెమిస్టర్‌కు 82 మంది పరీక్షలు రాయగా 590 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో ఆర్‌యూ రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, క్లస్టర్ పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ నాగరాజశెట్టి పాల్గొన్నారు.

ఇలాగైతే ఎలా?



ఎడమ కాలువకు నీటిని విడుదల చేసే తూము దుస్థితి

5వ పేజీ తరువాయి

శ్రీశైలానికి వరద రావడం, కాలువకు నీటిని విడుదల చేయడం జరిగిపోయింది. దీంతో అదనపు తూము నిర్మాణం కోసం మరో ఏడాది ఆగక తప్పని పరిస్థితి.

అసంపూర్తిగా జలాశయం పనులు

పత్తికొండ జలాశయం సామర్థ్యం 1.126 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.85 టీఎంసీలు కూడా నిల్వ చేసుకోలేని పరిస్థితి ఉంది. ప్రధాన కారణం రిజర్వాయర్ స్టోన్ రివిట్‌మెంట్ (రాతిపరుపు), సర్‌ప్లస్ కోర్ (కడతూము దిగువ భాగం), జలాశయం ఆనకట్ట బయట వైపు డ్రైన్స్ ప్యారాపెట్ వాల్.. వంటి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీటిని పూర్తి చేయాలంటే సుమారు రూ.40-50 కోట్లు నిధులు అవసరం ఉంది. అలాగే కుడి, ఎడమ కాలువలు, పంట కాలువలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ పనులకు రూ.210 కోట్లు నిధులు అవసరమని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు.

అదనపు ఇన్‌లెట్ నిర్మాణం చేపడుతాం



హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా 1.126 టీఎంసీల సామర్థ్యంతో పత్తికొండ (పందికోన) జలాశయం నిర్మించారు. కుడి, ఎడమ కాలువల సామర్థ్యం 816 క్యూసెక్కులు కాగా, ప్రధాన కాలువ నుంచి జలాశయానికి నీటిని మళ్లించే ఇన్‌లెట్ సామర్థ్యం 388 క్యూసెక్కులు తక్కువగా ఉంది. అందుకు సరిపడ అదనపు ఇన్‌లెట్ తూము నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వచ్చే ఏడాదిలోగా పనులు పూర్తి చేసి, రాబోయే ఖరీఫ్‌లో పూర్తి సామర్థ్యం 816 క్యూసెక్కులు విడుదల చేసేందుకు ఇన్‌లెట్స్ సిద్ధం చేస్తాం. కుడి, ఎడమ కాలువ అసంపూర్తి పనులు కూడా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

● పాండురంగయ్య, ఎస్ఈ, హంద్రీనీవా ప్రాజెక్టు సర్కిల్-1, కర్నూలు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇసుకాసురులు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. ఇసుకను అనుమతుల్లేకుండా అక్రమ రవాణా సాగిస్తూ లక్షల్లో దోచుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలున్నాయి. ట్రాక్టరు ఇసుకకు వేలల్లో వసూలు చేస్తుండటంతో ఇంటి నిర్మాణదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఓర్వకల్లు జగనన్న కాలనీలో నిల్వ ఉన్న అక్రమ ఇసుక



ఇసుకాసురులు

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- అధికారులకు ముడుపులు
- రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్న వ్యాపారులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ఓర్వకల్లు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇసుకాసురులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇసుక అక్రమ రవాణాపై కఠినచర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినా క్షేత్రస్థాయిలో పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికారులు ఇసుక అక్రమ రవాణాను చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ఓర్వకల్లు మండలానికి కర్నూలు పాయింట్ నుంచి ఈర్లదిన్నె, ముడుముల, సింగోరం, తదితర ప్రాంతాల నుంచి ఓర్వకల్లుకు టిప్పర్ల ద్వారా ఇసుకను వ్యాపారులు తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తూ వ్యాపారులు రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్నారని ఆయా గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలున్నాయి. అక్రమార్కులు ఓర్వకల్లు, హుశేనాపురం ప్రాంతాల్లో ఇసుకను నిల్వచేసి మండలానికి అంతా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రూ.6వేల నుంచి రూ.7వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం



బైరెడ్డి కాలనీలో ఇసుకను ట్రాక్టరులో వేస్తున్న కూలీలు

దళారీ వ్యవస్థను తరిమికొట్టండి



కర్నూలు పాయింట్ నుంచి ఓర్వకల్లుకు ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. ఇసుకను ఆసరాగా చేసుకుని దళారులు రూ.లక్షల్లో డబ్బులు సంపాదించి జేబులు నింపుకుంటున్నారు. దళారీ వ్యవస్థను అధికారులు కట్టడిచేసి కఠినంగా శిక్షించాలి ● శ్రీధర్, సీఐటీయూ జిల్లా నాయకుడు

రాత్రింబవళ్లు తరలిస్తున్నారనే..

ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని పదేపదే చెబుతున్నారు. అయినా కర్నూలు పాయింట్ నుంచి ఓర్వకల్లుకు ఇసుక అక్రమ రవాణా రాత్రింబవళ్లు కొనసాగుతూనే ఉంది. ఈ ఇసుక రవాణా ఎలా జరుగుతుంది అనే కోణంలో సంబంధిత ఉన్నతాధికారులు దర్యాప్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే.. ట్రాక్టరు ఇసుక వేలల్లో వసూలు చేస్తుండటంతో ఇంటి నిర్మాణదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఓర్వకల్లుకు చేరుకున్న ఇసుక లారీ

అధికారులు పట్టించుకోకపోవడం..



ఈర్లదిన్నె, ముడుమాల, సింగోరం, తదితర ప్రాంతాల నుంచి ఓర్వకల్లుకు పగలు రాత్రి అనే తేడా లేకుండా టిప్పర్లతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా కూడా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

● రమేష్, సీపీఐ నాయకుడు

కఠిన చర్యలు తీసుకుంటాం



ఓర్వకల్లుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఎవరైన ఇసుక అక్రమ తరలింపునకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. మండలంలో ఎవరైన ఇసుక అక్రమ రవాణా చేస్తే తమ దృష్టికి తీసుకురావాలి.

● విద్యాసాగర్, తహసీల్దార్, ఓర్వకల్లు

విద్యార్థికి అభినందనలు

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు మహ్మద్‌వలి ఎంపిక



మహ్మద్ వలిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నీలకంఠేశ్వర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మహ్మద్‌వలి జాతీయ స్థాయిలో జరిగే వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం పాఠశాలలో విద్యార్థి మహ్మద్‌వలిని హెచ్ఎం శోభారాణి, పీఈటీలు వెంకటేశ్, బసవరాజు, సృజనను అభినందించారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వలి ఈనెల 26, 27తేదీల్లో విజయవాడ ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 72 కేజీల విభాగంలో తన వ్యక్తిగత ప్రతిభను చాటి ప్రథమ బహుమతిని సాధించాడు. జార్ఖండ్ రాష్ట్రంలో ఆగస్టు నెల 19, 20, 21తేదీల్లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహబూబ్ బాషా, తిమ్మప్ప, కరే కృష్ణ, భీమేష్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తెచ్చి.. నీటిని స్ప్రే చేస్తూ



నీటిని స్ప్రే చేస్తున్న దృశ్యం



చిన్నగిడ్డయ్య, గోరంట్ల

ఖరీఫ్ ఆరంభంలో అనుకూలించిన వర్షాలు రెండు వారాలుగా ముఖం చాటేశాయి. ఉల్లి నాటుకున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పది రోజులుగా వర్షం లేకపోవడం, పైగా గాలుల ప్రభావంతో భూమిలో తేమశాతం తగ్గిపోయింది. ఉల్లికాడలు వాడిపోయి ఎండు దశకు చేరుకుంటున్నాయి. ఈరోజైనా వర్షం రాకపోతుందా అని అన్నదాతలు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నా నిరాశే ఎదురవుతోంది. దీంతో మంగళవారం గోరంట్లకు చెందిన చిన్నగిడ్డయ్య అనే రైతు ట్యాంకర్లతో నీటిని తెచ్చి రెండెకరాల్లో సాగు చేసిన ఉల్లిపంటకు నీటిని స్ప్రే చేయించాడు. రెండెకరాలకు మూడు ట్యాంకర్ల నీటిని తరలించడానికి రూ.4500, పంపు స్ప్రే చేయడం కోసం ఇద్దరు కూలీలకు రూ.వెయ్యి ఖర్చు అయ్యింది. ప్రస్తుతం మొక్కకు తడి అందిస్తే చాలునని, రెండు మూడు రోజుల్లో వర్షం రాకపోతుందా అన్న నమ్మకాన్ని రైతు వెలిబుచ్చాడు.

● కోడుమూరు రూరల్, ఆంధ్రజ్యోతి



పొలం వద్ద నీటి ట్యాంకరు

టీజీవీ కల్చరల్ అకాడమీకి రెండు జాతీయ బహుమతులు

కర్నూలు కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని అభినయ ఆర్ట్ సంస్థ ఆవిర్భవించి 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పౌరాణిక పద్య నాటక పోటీలు నిర్వహించారు. ఈ నాటక పోటీల్లో చివరి రోజున కర్నూలు టీజీవీ కల్చరల్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన 'శ్రీ వేంకటేశ్వర మహాత్యం' భక్తిరస పద్య నాటకానికి రెండు జాతీయ స్థాయి బహుమతులు లభించాయి. ఈ బహుమతుల్లో ఈ నాటకంలో అనంతాచార్య పాత్రధారి జె.మోహన్‌నాయక్‌కు ఒకటి, నాటకంలో బాల వెంకటేశ్వర స్వామి పాత్రధారి సురభి యశోధర్‌లకు మరో బహుమతి లభించినట్లు నాటక దర్శకుడు, టీజీవీ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణారెడ్డి మంగళవారం తెలిపారు. జాతీయ బహుమతులు సాధించిన కళాకారులను, నాటక దర్శకుడిని నగరానికి చెందిన పలువురు కళాకారులు అభినందించారు.



బహుమతులు అందుకుంటున్న టీజీవీ కల్చరల్ అకాడమీ దర్శకుడు వీవీ రమణారెడ్డి, కళాకారులు

వచ్చారు.. ముగించారు..!

- ఎనిమిది నిమిషాల్లో ముగిసిన కౌన్సిల్ సమావేశం
- రెండు వర్గాలు చెరోసారి నిర్వహణ
- నలిగిపోతున్న అధికారులు
- చైర్మన్‌కు అవినీతిని ప్రశ్నిస్తారన్న భయం పట్టుకుంది
- కో-ఆప్షన్ మెంబర్ శ్రీనివాసరెడ్డి



11.27 గంటలకు సమావేశానికి హాజరవుతున్న చైర్మన్, ఎంపీ వర్గం కౌన్సిలర్లు

నందికొట్కూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని చైర్మన్ ఇలా వచ్చి.. అలా ముగించుకు వెళ్లారు. మంగళవారం సమావేశం ప్రారంభమైన ఎనిమిది నిమిషాల్లో చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్ని సర్దేసి బయటపడ్డారు. ఆయన సమావేశం ముగించాక ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు సమావేశానికి వచ్చి అధికారులతో మరోసారి నిర్వహించారు. ఒకే సమావేశాన్ని రెండు వర్గాలు చెరొకసారి నిర్వహించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రెండు వర్గాల మధ్య అధికారులు నలిగిపోతున్నారు. సాధారణంగా చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంలో ముగిశాక అధికారులు కూడా అక్కడి నుంచి వెళ్లిపోవాల్సి ఉందని కౌన్సిలర్లు చెబుతున్నారు. కాని ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు ఆలస్యంగా రావడంతో వారు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ బేబి సమాధానం చెప్పే ప్రయత్నించారు. చైర్మన్ సభను ముగించాక మీరు ఎలా కొనసాగిస్తారని చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి కమిషనర్‌ను ప్రశ్నించారు. దీంతో రెండు వర్గాల మధ్య నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయ అధికారులు నలిగిపోతున్నారు.

అధికారుల పడిగాపులు

ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సిన కౌన్సిల్ సమావేశానికి అధికారులు 10.45 గంటలకే హాజరయ్యారు. నాయకుల కోసం 45 నిమిషాలు వేచి చూసిన తర్వాత చైర్మన్‌తో పాటు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వర్గం కౌన్సిలర్లు, వైసీపీ కౌన్సిలర్లు మొత్తం తొమ్మిది మంది 11.34 గంటలకు చేరుకున్నారు. ఎమ్మెల్యే వర్గానికి చెందిన ఇద్దరు మహిళా కౌన్సిలర్లు కూడా హాజరయ్యారు. సభను నిర్వహించడానికి మూడో వంతు మెజార్టీ ఉండడంతో సభను నిర్వహించవచ్చని కమిషనర్ బేబి చైర్మన్‌కు సూచించడంతో సభను ప్రారంభించారు. ఎనిమిది నిమిషాల్లో సమావేశాన్ని చైర్మన్ ముగించి వెళ్లి పోయారు.

ఎవరికి వారుగా నిర్వహణ

మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఎవరికి వారుగా నిర్వహించుకున్నారు. ముందుగా ఈ సమావేశం ఉదయం 11.00 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 11.34 గంటలకు ప్రారంభమై అధికారులు అజెండా చదవగానే ఆమోదం తెలిపి 11.42గంటలకు సభను చైర్మన్ ముగించారు. ఆ తర్వాత 11.44 గంటలకు ఎమ్మెల్యే జయసూర్య వర్గం కౌన్సిలర్లు సమావేశానికి వచ్చారు. అవినీతిని ప్రశ్నిస్తామనే భయంతోనే సమావేశాన్ని త్వరగా ముగించుకొని వెళ్లారని కోఆప్షన్ మెంబర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మీరు వస్తున్నారని చెబితే చైర్మన్‌ను రిక్వెస్ట్ చేసేవారమని కమిషనర్ బేబి తెలిపారు. నిబంధనల ప్రకారం సభ ప్రారంభమైనప్పటి నుంచి గంట వరకు సమయం ఉంటుందని, ఆవిషయాన్ని కూడా చైర్మన్ గుర్తించకపోవడం ఏమిటని 2వ వార్డు కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ ప్రశ్నించారు.

కాలయాపన చేయడం ఏమిటి?

చైర్మన్‌ను నిలదీయాలనుకున్న ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు సమయానికి సమావేశానికి రావాలి. కానీ కమిషనర్ రూంలో కూర్చొని కాలయాపన చేయడం ఏమిటని సభ అనంతరం ఎంపీ వర్గం కౌన్సిలర్లు ఆరోపించారు. సభకు హాజరైన ఎమ్మెల్యే వర్గానికి చెందిన ఇద్దరు మహిళా కౌన్సిలర్లను వెనక్కి ఎందుకు పిలిపించుకున్నారని వారు ప్రశ్నించారు. సొంత అజెండాలతో సమావేశాలకు ఎంపీ, ఎమ్మెల్యే వర్గాల కౌన్సిలర్లు ఎవరికి వారుగా హాజరవుతూ సభను గందరగోళం చేయడం తప్ప ప్రజా సమస్యల పరిష్కారం కోసం సభను నిర్వహించడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రతిపాదనలను చైర్మన్ ఆమోదం తెలిపారా?

గత సమావేశంలో మెజార్టీ కౌన్సిలర్లు ప్రతిపాదించిన ప్రతిపాదనలను చైర్మన్ ఆమోదం తెలిపారా లేదా అని కమిషనర్ బేబిని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఆమోదం తెలపలేదని ఆమె తెలపడంతో మినిట్స్ బుక్ ఎందుకు మెయింటెన్ చేయడం లేదని జాకీర్ ప్రశ్నించారు. నాలుగేళ్లుగా అధికారులకు తాము పదేపదే చెబుతున్నా కూడా మినిట్స్ బుక్కును మెయింటెన్ చేయడం లేదన్నారు. దీనివల్ల అజెండాలో ఆమోదం పొందిన వాటికి బదులు తమకు ఇష్టం వచ్చిన పనులను మినిస్ట్ బుక్కులో తర్వాత చేర్చుకొని ఆమోదం తెలుపుకుంటున్నారన్నారు. ప్రజల నుంచి పన్నుల రూపంలో ఎంత సొమ్ము వసూళ్లు చేస్తున్నాం... ఎంత ఖర్చు చేస్తున్నామని ఆయన అధికారులను ప్రశ్నించారు.

పలు శాఖ అధికారులు గైర్హాజరు

కౌన్సిల్ సమావేశానికి మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఐసీడీఎస్, హౌసింగ్ శాఖ సంబంధిత అధికారులు మినహా ఇతర ఏఒక్క శాఖ అధికారులు కూడా సభకు హాజరు కాలేదు. దీంతో పట్టణ ప్రజల సమస్యలపై ఏ పాటి చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమౌతోంది.



11.42 గంటలకు సమావేశాన్ని ముగించుకుని వెళ్తున్న చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



11.44 గంటలకు సమావేశానికి హాజరవుతున్న ఎమ్మెల్యే వర్గం కౌన్సిలర్లు

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సిన గడువు పెంచినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 2026-27వ విద్యాసంవత్సరానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతామన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఉమ్మడి కర్నూలు జిల్లా వాసులై ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తును ఆగస్టు 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 07-02-2025 శనివారం రోజున ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు. అలాగే అభ్యర్థులు 2025-26వ సంవత్సరంలో 10వ తరగతి పూర్తిచేసి ఉండాలన్నారు. వివరాలకు 08512-294545 నంబర్‌ను కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

కళాశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఈఏడాది ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని కడప ఆర్జేడీ డా.సురేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాళ్ల సమావేశాన్ని ఆర్ఐవో జి.లాలెప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఫస్టియర్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలలో భాగంగా సిలబస్‌లో మార్పులు, అడిషినల్ సబ్జెక్టుల పేరుతో కొత్త కాంబినేషన్లకు అవకాశం ఇచ్చారన్నారు. గణితం-ఏ, బీ పేపరు రెండింటిని కలిపి ఒకే పేపర్‌గానూ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులను కలిపి బయాలజీగా ప్రవేశపెట్టారన్నారు. ఈ నూతన సంస్కరణలపై అన్ని జూనియర్ కళాశాలల మేనేజ్‌మెంట్లు, ప్రిన్సిపాల్స్ స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆర్ఐవో లాలెప్ప, ఏజీఎంవో సుంకన్న, ప్రిన్సిపాల్ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా పదోన్నతి

30 ఏళ్ల తర్వాత అవకాశం




విజయకుమార్

కర్నూలు, జూలై 29(ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఆఫీసులో సీనియర్ స్టెనోగ్రాఫర్‌గా పని చేస్తున్న విజయకుమార్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 1993లో స్టెనోగా చేరిన ఆయన 1995 వర కు పార్లమెంటు కార్మిక శాఖ, కర్మాగారాల శాఖ స్టెనోగ్రాఫర్‌గా పని చేశారు. అప్పటి మంత్రులు పరిటాల రవీంద్ర, తలసాని శ్రీనివాస్ యాదవ్ పేషీలలో 1995 నుంచి 2004 వరకు పనిచేశారు. ఆ తర్వాత నీటి పారుదల శాఖకు బదిలీ అయ్యారు. అప్పటినుంచి కర్నూలు జలవనరుల శాఖ సర్కిల్ ఆఫీసులో స్టెనోగ్రాఫర్‌గా, సీనియర్ స్టెనోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. 30 ఏళ్ల తర్వాత ఆఫీసు సూపరింటెండెంట్‌గా పదోన్నతి వచ్చింది. 2009లో వరద పోటెత్తిన సమయంలో ఆయన చేసిన సేవలకు ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకున్నారు. పదోన్నతి పొందిన విజయకుమార్‌ను ఎస్ఈ బాలచంద్రా రెడ్డి, సిబ్బంది అభినందించారు.

ఆపరేషన్ టీ132ఎఫ్

(5వ పేజీ తరువాయి)

మళ్లీ కచ్చితమైన ప్రదేశంలోకి పెద్దపులి వస్తుందని భావించిన అటవీ అధికారులు మూడు బృందాలను అక్కడ అప్రమత్తం చేశారు. 6వ తేదీ తెల్లవారుజామున 5:17 గంటలకు పెద్దపులి ఆవుదూడ కళేబరం వద్దకు రాగానే ట్రాంక్ లైజర్ గన్‌తో పులికి మత్తు ఇచ్చారు. దీంతో అక్కడి నుంచి పరారైన పులి 5:40గంటలకు మత్తులోకి వెళ్లింది. అప్పటికే డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడంతో పులిని గుర్తించి బ్యాక్ అండ్ టీం సహకారంతో బైర్లూటి వైల్డ్‌లైఫ్ డిస్పెన్సరీకి తీసుకొచ్చి ఎన్ఎస్‌టీఆర్ వైల్డ్‌లైఫ్ డాక్టర్లు జుబేర్‌వలి, ఆరన్ వెస్లీ నేతృత్వంలో ప్రాథమిక చికిత్సలు అందించారు. ఆ తర్వాత ఎనిమల్ ట్రాన్స్‌పోర్ట్ వెహికల్‌లో దాన్ని తిరుపతి ఎస్వీ జూపార్క్‌కు తరలించారు. మెడభాగంలో తీవ్రంగా గాయపడిన పులికి 7వ తేదీన తిరుపతి జూపార్క్ డిస్పెన్సరీలో వైద్యనిపుణులు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం జూపార్క్‌లోని ఎనిమల్ రెస్క్యూ సెంటర్‌లో పులికి సపర్యలు అందిస్తున్నారు. గాయపడిన పులి పూర్తి ఆరోగ్యవంతంగా ఉన్నట్లయితే తిరిగి దాన్ని నల్లమలలో వదిలేయాలని అటవీ అధికారులు భావిస్తున్నారు.



పులికి ఎరగా చెట్టుకు కట్టి ఉంచిన దూడ(ఫైల్)



ఆవుదూడను చంపి తింటున్న పెద్దపులి(ఫైల్)



పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు



పులిని తరలిస్తున్న సిబ్బంది

పులిని రక్షించాలన్న తపనతో పనిచేశాం



ఉచ్చుకి చిక్కి తప్పించుకుని గాయపడిన పులిని ఎలాగైనా రక్షించాలన్న తపనతో 21 రోజుల పాటు ధైర్యసాహసాలతో రాత్రింబవళ్లు పనిచేశాం. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎన్‌టీసీఏ ఆలోచనల మేరకు ఎట్టకేలకు అతికష్టం మీద పులిని బంధించాం. ఇక్కడే చికిత్సలు అందించడం కష్టతరమని భావించి వెంటనే తిరుపతి ఎస్వీ జూపార్క్‌కు తరలించాం. అక్కడి జూపార్క్ వైద్యులు విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. పులి ఆరోగ్యం పూర్తిగా కుదుటపడితే దాన్ని తిరిగి నల్లమలలో వదిలేయాలన్న ఆలోచనలో ఉన్నాం. ఈ రెస్క్యూ ఆపరేషన్ అన్ని బృందాలుగా బాధ్యతగా పని చేయడం వల్లే విజయం సాధించాం. ఈ ఆపరేషన్ ఎన్ఎస్‌టీఆర్‌లో అరుదైన ఘటన కావడంతోనే వరల్డ్ టైగర్ డే సందర్భంగా ప్రత్యేక వీడియో డాక్యుమెంటరీని రూపొందించాం.

వి.సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్

తుంగభద్ర నదిలో మొసలి కలకలం

మంత్రాలయం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని తుంగభద్ర నది గణేష్ ఘాట్ వద్ద మంగళవారం ఓ మొసలి కనిపించింది. ఆ స్నానఘట్టం వద్ద ప్రజలు స్నానం చేయడం, బట్టలు ఉతకడం వంటివి చేస్తుండగా నదిలో మొసలి కనిపించడంతో భయభ్రాంతులకు గురయ్యారు. మొసలి ఒడ్డుకు చేరే ప్రయత్నం చేస్తుంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు మొసలిని పట్టుకోవడమో.. లేదా ఏదైనా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీనగర్‌లో విధులు నిర్వహిస్తూ..

- గుండెపోటుతో వీరజవాన్ మృతి



అశోక్(ఫైల్)

చాగలమర్రి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవంగలి గ్రామానికి చెందిన అశోక్ (26) సీఆర్పీఎఫ్ జవాన్‌గా జమ్మూ కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి శ్రీనగర్‌లో గుండెపోటుతో మృతి చెందారు. అశోక్ ఆర్మీలో ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తూ దేశ రక్షణ కోసం అహర్నిశలు పాటుపడుతూ చివరకు ప్రాణాలు కోల్పోయారు. అతడి తండ్రి శేఖర్ కూడా ఆర్మీలో ఆర్మీలో పీఎస్‌ఎఫ్ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అశోక్ అకాల మరణంతో ఆ కుటుంబంలో విషాద చాయలు అలుముకున్నాయి. వీర జవాన్ మృతితో యువకులు బుధవారం చాగలమర్రి టోల్‌ప్లాజా నుంచి పెద్దవంగలి గ్రామం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు యూత్ సభ్యులు పేర్కొన్నారు. వీరసైనికుడి మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని కర్నూలు జైజవాన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు రామకృష్ణ పేర్కొన్నారు. అశోక్ కుటుంబానికి సంతాపం ప్రకటించారు.

కడుపునొప్పి తాళలేక..

- పురుగుమందు తాగి వ్యక్తి బలవన్మరణం



నరసింహులు(ఫైల్)

గోనెగండ్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక పురుగుమందు తాగి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని గంజహళ్లి గ్రామంలో చోటుచేసుకున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన బోయ నరసింహులు(50)కు భార్య మీనాక్షి, ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని నెలలుగా నరసింహులుకి కడుపునొప్పి ఉండేది. కుటుంబ సభ్యులు పలు చోట్ల వైద్యం చేయించినా తగ్గలేదు. సోమవారం మధ్యాహ్నం తీవ్ర కడుపునొప్పి రాగా వైద్యుల వద్ద చూపించినా తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తి అతడు పురుగు మందు తాగాడు. గమనించిన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. భార్య మీనాక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వేటకొడవలితో వ్యక్తిపై దాడి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిపై వేటకొడవలితో దాడిచేశాడు. ఈఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకు న్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. కోడుమూరు పట్టణానికి చెందిన ఎరుకలి కృష్ణ, బోయ ఠాగూర్ కలిసి గోనెగండ్లలో మద్యం తీసుకున్నారు. మద్యం తాగేందుకు గోనెగండ్ల సమీపంలోని బాట మారెమ్మవ్వ దేవాలయం సమీపంలోని కాలువగట్టుపైకి వచ్చారు. మద్యం తాగిన తర్వాత బోయ ఠాగూర్ ఎరుకలి కృష్ణను ఎందుకు తన తల్లిని తిట్టావని గొడవకు దిగాడు. ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఎరుకల కృష్ణపై ఠాగూర్ వేటకొడవలితో దాడి చేశాడు. దీంతో అతడి తలకు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రాణభయంతో కృష్ణ పక్కలో ఉన్న పొలాల్లో తలదాచుకున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు ఎమ్మిగనూరు రూరల్ పోలీసులకు సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న సీఐ, ఎస్ఐలు రాత్రంతా గాలించారు. తెల్లవారుజామున 5గంటలకు రోడ్డు పక్కలో పడి ఉన్న ఎరుకలి కృష్ణను గుర్తించి చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.


సారా విక్రేతపై పీడీ యాక్ట్

- కడప సెంట్రల్ జైలుకు తరలింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ

నంద్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో సారా కేసుల్లో నిందితుడైన ఓ విక్రేతపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఏకంగా పీడీ యాక్ట్‌ను నమోదు జైలుకు పంపింది. పాణ్యం మండలం కేంద్రంలోని ఏఆర్ కాలనీకి చెందిన కాశన్న కుమారుడు మాణిపాటి రాజు 2022 నుంచి సారా తయారీ చేయడంతో పాటు విక్రయాలు చేశారు. దీంతో ఎక్సైజ్ పోలీసులు నాలుగు కేసులు కూడా నమోదు చేశారు. అయితే కలెక్టర్ రాజకుమారి ఈ నెల 24వ తేదీన సదరు విక్రేతపై పీడీయాక్ట్ నమోదు చేసి ప్రభుత్వానికి తగిన సమగ్ర నివేదికను అందజేశారు. ఈ నేపథ్యంలో నివేదిక ఆధారంగా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ ముందస్తు నిర్బంధ చట్టం 1986 ప్రకారం రాజుపై పీడీయాక్ట్‌ను ఆమోదిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ అనుమతితో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, సీఐ కృష్ణమూర్తి సిబ్బంది కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఎవరైనా సారా తయారీ, విక్రయాలు, రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ హెచ్చరించారు. పదేపదే పట్టుబడితే కేసులతో పాటు పీడీయాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామని తెలియజేశారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

గడివేముల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయి గడివేముల బస్టాండులో ఉన్న బాలుడిని వారి బంధువులకు అప్పగించామని ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. దామగట్ల గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలుడు మహేష్ పాఠశాలకు వెళ్తున్నానని ఇంటి వద్ద చెప్పి స్కూల్‌కు వెళ్లకుండా నందికొట్కూరు బస్టాండుకు వచ్చాడు. బంధువుల గ్రామమైన గ్రంధివేములకు వెళ్లేందుకు బస్సు ఎక్కగా గ్రంధివేములలో దిగకుండా గడివేములలో దిగాడు. ఎక్కడికి వెళ్లాలో తెలియక బస్టాండులో ఏడుస్తూ కూర్చున్న బాలుడిని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ విచారించి బాలుడిని వారి బంధువులకు అప్పగించారు.



బాలుడిని అప్పగిస్తున్న ఎస్ఐ

రెవెన్యూ సిబ్బందిపై కొరడా

- ఎనిమిది మందికి మెమోలు జారీ చేసిన కమిషనర్



కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందిపై నూతన కమిషనర్ కొరడా ఝుళిపించారు. విధుల్లో నిర్లక్ష్యం, జవాబు దారీతనంతో పనిచేయకపోవడంతో ఎనిమిది మందికి సోమవారం కమిషనర్ మెమోలు జారీ చేశారు. నగరంలో ఉన్న మున్సిపల్ దుకాణాల అద్దె వివరాలు, వసూలు, బకాయిల వివరాలు, రిపోర్టులు పలుమార్లు అడిగినా ఇవ్వక పోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఆఫీసర్ జునైద్ సిబ్బందికి మెమోలు జారీ చేశారు. దీంతో రెవెన్యూ విభాగంలో ప్రక్షాళన మొదలైంది. ఇంతకాలం రెవెన్యూ విభాగంలో ఏమిచేసినా ఎవరూ ఏమి చేయలేరనే ఉద్దేశ్యంతో సిబ్బంది నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరించారు. కమిషనర్ ఒక్కసారి మెమోలు జారీ చేయడంతో ఉలిక్కిపడ్డారు. మెమోలు తీసుకున్న వారిలో ఏ1 క్లర్క్ జి.సోహేల్ అహ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు టి.శ్రీనివాసులు, ఎస్.తిప్పన్న, ఎం.రాజు, ఆర్.రాజు, ఎస్.మన్సూర్‌బాష, పి.భార్గవ్, శివశంకర్‌లు ఉన్నారు. మెమోలు తీసుకున్న రెండురోజుల్లో సరైన వివరణ ఇవ్వకపోతే నిబంధనల ప్రకారం శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని మెమోలో పేర్కొన్నారు.

ఇద్దరిపై అత్యాచారయత్నం

కొలిమిగుండ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకునే ఇద్దరు మహిళలపై ముగ్గురు మద్యం మత్తులో ఉన్న యువకులు అత్యాచారానికి యత్నించిన ఘటన కొలిమిగుండ్ల మండలంలో మంగళవారం వెలుగుచూసింది. అయితే మహిళలు చాకచక్యంగా వ్యవహరించి జీపు నుంచి దూకి పరుగులు తీయడంతో అఘాయిత్యం నుంచి తప్పించుకోగలిగారు. జమ్మలమడుగుకు చెందిన ఇద్దరు మహిళలు, ఓ వృద్ధ మహిళ, 3ఏళ్ల చిన్నారితో కలిసి సోమవారం ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకోవడానికి కొలిమిగుండ్ల మండలంలోని గొర్విమానుపల్లెకు వచ్చారు. సాయంత్రం చీకటి పడుతుండగా గొర్విమానుపల్లె నుంచి జమ్మలమడుగుకు బయలుదేరడానికి గ్రామంలోని ప్రధాన రహదారిలో వేచివున్నారు. అదే సమయంలో అల్ట్రాటెక్ పరిశ్రమకు చెందిన ఓ క్యాంపరు(తొట్టి)జీపు అటుగా రావడంతో మహిళలు ఆపారు. తాము బుగ్గకు వస్తామని చెప్పగా అందులో ప్రయాణించే ముగ్గురు యువకులు వారిని ఎక్కించుకున్నారు. జీపు ఎక్కిన తరువాత గోర్విమానుపల్లె నుంచి తుమ్మలపెంట సమీపంలో అప్పటికే మద్యం మత్తులో ఉన్న యువకులు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టారు. దీంతో తీవ్ర అసౌకర్యానికి గురైన మహిళలు తమకు వాంతులు వచ్చేవిధంగా ఉందని జీపు ఆపితే దిగుతామని చెప్పినా వినలేదు. వారిని అత్యాచారం చేయాలనుకున్న యువకులు జీపును వెనక్కి తిప్పి గనుల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. ప్రమాదాన్ని పసిగట్టిన మహిళలు చిన్న పాపతో కలిసి కిందకు దూకారు. దీంతో వారికి గాయాలు కాగా, అలాగే పరుగులు తీస్తూ ప్రధాన రహదారిపైకి చేరుకుని వాహనాల్లో పెట్నీకోటకు చేరుకున్నారు. స్థానిక ప్రథమ చికిత్సా కేంద్రంలో చికిత్స చేయించుకుని, స్థానికుల ద్వారా కొలిమిగుండ్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని యువకులు, క్యాంపరు వాహనం కోసం ఆరా తీశారు. మరోవైపు జీపులోనే ఉన్న వృద్ధ మహిళను వారు సోమవారం రాత్రి పొద్దుపోయాక కొలిమిగుండ్లలో వదిలి వెళ్లారు. ఈ ఘటన మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాగా ఘటనపై పోలీసులు ఇంకా కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

పేకాటరాయుళ్ల అరెస్టు

పాములపాడు జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బానుముక్కల గ్రామ శివార్లలో పేకాట స్థావరాలపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వద్ద నుంచి రూ. 62, 400 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేశ్‌బాబు తెలిపారు. బానకచెర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పేకాట నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆత్మకూరు, ఇస్కాల, పాములపాడుకు, సింగవరం, ఎర్రగూడూరు, వెలుగోడు గ్రామాలకు చెందిన వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. మరో 11 మంది పారిపోయారని తెలిపారు. సిబ్బంది రామేశ్వరయ్య, చెన్నయ్య, ఖాజ, షేక్షావలి ఉన్నారు

లక్ష్యాలను సాధించాలి

- ఆగస్టు 8లోపు డేటా ఎంట్రీని పూర్తిచేయాలి
- కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళిక అమలులో భాగంగా వివిధ శాఖల పనితీరు సూచికల లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్-కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ లక్ష్యాల సాధన అంశాలపై ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్ అమలులో భాగంగా ప్రతి సంవత్సరం 15 శాతం అభివృద్ధిని సాధించేందుకు వీలుగా ఆయా శాఖల అభివృద్ధి లక్ష్యాలతో కీపెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌ను నిర్ధేశించారన్నారు. ఆగస్టు 8వ తేదీలోపు మండల స్థాయి డేటా ఎంట్రీని పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, సీపీవో హిమప్రభాకర్ రాజు, ఏడీ భారతి పాల్గొన్నారు.

జర్మన్‌భాషపై ఉచిత శిక్షణ

బనగానపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నర్సింగ్ కోర్సు చేసిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీభాషపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి నరసింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ చేసిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీ భాషలో 8 నుంచి 10నెలలపాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 35సంవత్సరాలకు మించకుండా ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళలు ఆధార్‌కార్డు, కుల ధృవీకరణ, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, నర్సింగ్ డిగ్రీ సర్టిఫికెట్, క్లినికల్ అనుభవం గల పత్రం, ఏపీ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ పత్రంకలిగి ఉండాలని సూచించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి కాపీలను నంద్యాల జిల్లా ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

‘నాలెడ్జ్’ సెంటర్ ఏర్పాటుపై వివాదం

- పూర్వ విద్యార్థులు వర్సెస్ వైద్యులు, విద్యార్థులు
- భవనం నిర్మిస్తే అడ్డుకుంటాం
- ప్రభుత్వ వైద్యులసంఘం అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ
- అభ్యంతరాలు ఉంటే సరిదిద్దుకుంటాం
- పూర్వవిద్యార్థుల సంఘం నాయకుడు డాక్టర్ గోవిందరెడ్డి



పూర్వవిద్యార్థుల నాయకులతో వాదిస్తున్న వైద్యులు, విద్యార్థులు



మైదానాన్ని పరిశీలిస్తున్న కాలేజీ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కేఎంసీ(కర్నూలు మెడికల్ కాలేజీ)లో నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు వివాదానికి దారి తీసింది. కాలేజీ మైదానంలో కేఎంసీ పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో నాలెడ్జ్ సెంటర్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సోమవారం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డా.పి.చంద్రశేఖర్ పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించి నాలెడ్జ్ సెంటర్‌కు తనవంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. మంగళవారం పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు ఉదయం తమకు వైస్‌చాన్స్‌లర్ అనుమతి ఇచ్చారని, భవన నిర్మాణానికి కొలతలు తీసుకోవడానికి ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లతో కలిసి మైదానానికి వచ్చారు. నాలెడ్జ్ సెంటర్‌ను 60 సెంట్లతో ఏర్పాటుచేయడానికి మైదానంలో ఎడమవైపు నుంచి కుడి వైపునకు స్థలాన్ని మార్చి కొలతలు తీసుకు న్నారు. ఇంతలో విషయం తెలుసుకున్న ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.బ్రహ్మాజీ మాస్టర్‌తో పాటు ప్రొఫెసర్లు, వైద్యులు కొందరు జూనియర్ డాక్టర్లు కలిసి పూర్వవిద్యార్థుల ప్రతినిధులతో గొడవకు దిగారు. నాలెడ్జ్ సెంటర్‌ను ఎట్టి పరిస్థితుల్లో గ్రౌండులో అనుమతించేది లేదని డా.బ్రహ్మాజీ మాస్టర్, కొంత మంది ప్రొఫెసర్లు కరాఖండిగా తేల్చి చెప్పారు. ప్రిన్సిపాల్ లేనప్పుడు కాలేజీకి ఎలా వస్తారనీ, ఇది సరైంది కాదన్నారు. ఇప్పటికే కాలేజీ గ్రౌండు ఏడు ఎకరాల నుంచి ఐదు ఎకరాలకు కుచించుకుపోయిందని, నాలెడ్జ్ సెంటర్ పేరుతో 60 సెంట్లు స్థలంలో భవనం నిర్మిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఎవరూ అడ్డుకోలేదు

వీసీ ఆదేశాల మేరకు నాలెడ్జ్ సెంటర్ నిర్మాణానికి సంబంధించి కొలతలు తీసుకోవడానికి మంగళవారం ఉదయం వచ్చామని కేఎంసీ పూర్వ విద్యార్థుల సంఘాల నాయకుడు డాక్టర్ గోవిందరెడ్డి తెలిపారు. తమను ఎవరూ అడ్డుకోలేదని ఈ సెంటర్‌ను కుడి వైపునకు జరిపి కొలతలు తీసుకున్నట్లు తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే సరిదిద్దుకుంటామన్నారు. 2021లో నాలెడ్జ్ సెంటర్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- ఏడు తులాల బంగారు, 250 గ్రాముల వెండి స్వాధీనం
- అభినందించిన ఎస్పీ

బనగానపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామానికి చెందిన ముల్లా జాఫర్ ఇంటిలో అదే గ్రామానికి చెందిన షేక్ నూర్ అహ్మద్ చోరీకి పాల్పడ్డాడు. నిందితుడి అరెస్ట్ చేసి అతడి వద్ద ఉన్న చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన ముల్లా జాఫర్‌హుసేన్ తన ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లారు. ఇది గమనించిన ఇంటి పక్కనే నివాసం ఉండే షేక్ నూర్ అహ్మద్ అతడి ఇంట్లో చొరబడి బీరువా తాళం పగులగొట్టాడు. అందులోని ఏడు తులాల బంగారు ఆభరణాలు, 450 గ్రాముల వెండిని చోరీ చేశాడు. వీటి విలువ రూ.5.10లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ముల్లా జాఫర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ, పోలీసులతో కలిసి వెళ్లి ఘటనాస్థలిని పరిశీలించి సాంకేతికత ఆధారంగా నిందితుడు నూర్ అహ్మద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. రెండు రోజుల్లోనే నిందితుడిని పట్టుకోవడంతో ఎస్పీ అభినందించారన్నారు.

పత్తి పంటపై గడ్డి మందు పిచికారి

ఆదోని రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటపై కొందరు దుండగులు గడ్డిమందు పిచికారి చేయడంతో పంట దెబ్బతిని రైతుకు దాదాపు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లింది. బాధిత రైతు దిబ్బనకల్లు గ్రామానికి చెందిన కురువ గోవిందు తెలిపిన మేరకు.. సర్వే నెం.1బీలో ఎకరా పొలం ఉంది. తన పొలానికి అనుకొని వీరేష్ అనే వ్యక్తికి రెండెకరాల పొలం ఉంది. గత మూడేళ్లుగా గోవిందు వీరేష్ పొలాన్ని గుత్తకు తీసుకున్నాడు. మొత్తం మూడెకరాల్లో పత్తి సాగు చేశాడు. కాగా ఇప్పటికే ఉన్న మనస్పర్థల కారణంగా గ్రామానికి చెందిన కృష్ణారెడ్డితోపాటు మరో ముగ్గురు సోమవారం అర్ధరాత్రి దాటాక పత్తి పంటపై గడ్డిమందు పిచికారి చేయడంతో కళకళలాడే పత్తిపంట మాడిపోయింది. ఈమేరకు మంగళవారం తాలుకా ఎస్ఐ రామాంజనేయులుకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పంటను పరిశీలించారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ తెలిపారు.



వాడిపోయిన పత్తి పంట

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా డాక్టర్ వసుధ

కర్నూలు హాస్పిటల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా డిప్యూటీ సర్జన్ డాక్టర్ ఏ.వసుధను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ కె.పద్మావతి ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జీజీహెచ్‌లో పని చేస్తున్న వసుధకు సివిల్ అసిస్టెంట్ సర్జన్ నుంచి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పించి ఖాళీగా ఉన్న కర్నూలు డీఐవోగా నియమించారు. ప్రస్తుతం డీఐవో డాక్టర్ నాగప్రసాద్ స్థానంలో డాక్టర్ వసుధ ఇమ్యూనైజేషన్ అధికారిగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఎక్సైజ్ పోలీసుస్టేషన్ తనిఖీ

కోడుమూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): కోడుమూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ మంగళవారం ఎక్సైజ్ సూపరెండెంట్ సుధీర్‌బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న నవోదయం కేసుల విషయం గురించి సీఐ మంజులను అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు చివరికి ఏ, బీ, సీ క్యాటగిరి గ్రామాల్లో నాటు సారా నిర్మూలించాలని సీఐని ఆదేశించారు. ఎస్‌ఐలు చంద్రమోహన్, లక్ష్మీ ఉన్నారు.

బీపీఈడీ ఫలితాలు విడుదల చేయాలి

కర్నూలు అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీపీఈడీ 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయాలని ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ 2025లో నిర్వహించిందని, త్వరలో ఫలితాలు విడుదల అవుతున్నాయని, కానీ బీపీఈడీ ఫలితాలు విడుదల కాలేదని అన్నారు. మే 13న పరీక్షలు పూర్తయినప్పటికీ నేటి వరకు ఫలితాలు ఎందుకు విడుదల చేయడంలేదని ప్రశ్నించారు. కార్యక్ర మంలో అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు రాజీవ్, శరత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా శింగరయ్యస్వామి రథోత్సవం

సి.బెళగల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు గ్రామంలో శింగర య్యస్వామి రథోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నగరంలో బీజేపీ భారీ ర్యాలీ

● చాయ్‌పే చర్చలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరం మంగళవారం కాషాయమం అయింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పర్యటన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. మున్సిపల్ ఎగ్జిబిషన్ మైదానం నుంచి కిడ్స్ వరల్డ్, రాజ్‌విహార్ మీదుగా మౌర్యఇన్ హోటల్ వరకు భారీ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్య లో బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఏ.క్యాంపులోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి, రాజ్‌విహార్ సర్కిల్‌లోని స్వామి వివేకానందుని విగ్రహానికి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, టీజీ వెంకటేశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **అమ్మ పేరుతో ఒక మొక్క:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'అమ్మ పేరుతో ఒక మొక్క' అనే కార్యక్రమంలో కర్నూలు జిల్లా సారథ్యం మంగళవారం ప్రారంభమైంది. స్థానిక వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారధి మొక్కను నాటారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుతో కలిసి బీజేపీ నాయకులు వ్యాయామం చేశారు.

చాయ్‌పే చర్చ: రాష్ట్రంలో బీజేపీ బలోపేతమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని పీవీఎన్ మాధవ్ తెలిపారు. నగరంలోని స్టేడియం వద్ద వాకర్స్‌తో చాయ్‌పే చర్చ నిర్వహించారు. స్థానికులు మాధవ్‌తో కలిసి టీ తాగుతూ అనేక సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశంలోని అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు.


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం

కర్నూలు లీగల్: కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ చౌదరి ఆధ్వర్యంలో పలువురు సీనియర్ న్యాయవాదులు ఆయనను కలిశారు. ఆయన మాట్లాడుతూ హైకోర్టును కోరడం రాయలసీమ వాసుల న్యాయమైన కోరిక అని అన్నారు. అనంతరం ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడారు. సీనియర్ న్యాయవాదులు నాగేంద్రనాథ్, నరసింహులు, ఉమర్ జావీద్ అలి, బీజేపీ లీగల్ సెల్ నాయకులు లోకేశ్వరయ్య, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

బలిజలకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలి

కర్నూలు ఎడ్యుకేషన్: బలిజలకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఓబీసీ సాధన సమితి సభ్యులు కోరారు. మంగళవారం కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా పీవీఎన్ మాధవ్‌ను వీరశైవ లింగాయత్ లింగబలిజ, ఓబీసీ సాధన సమితి ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఓబీసీ సాధన సమితి సభ్యులు జాయ్ కాశీనాథప్ప, వీరప్ప, మంజునాథ్, విజయ్, గని ఉన్నారు.

'పీఎం శ్రీ' ప్రభుత్వ పాఠశాలలకు వరం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


ఓర్వకల్లు మోడల్ స్కూల్‌లో పీఎం శ్రీ పథకం శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, జూలై 29(ఆంధ్రజ్యోతి): పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్) పథకం ప్రభుత్వ పాఠశాలలకు వరం లాంటిదని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ పీఎం శ్రీ పథకం కింద ఎంపికైంది. మంగళవారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, డీఈఓ శ్యాముల్‌పాల్ ఆదర్శ పాఠశాలలో పీఎంశ్రీ పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా తరగతి గదులు, ఇంటర్నెట్, విద్యార్థుల ఉత్తీర్ణత రికార్డులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓర్వకల్లు ఏపీ మోడల్ స్కూల్ బెస్ట్ పాఠశాలగా పీఎం శ్రీ పథకానికి జిల్లాలోనే తొలి పాఠశాలగా ఎంపికవ్వడం హర్షనీయమన్నారు. తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓలు ఓంకార్ యాదవ్, శ్రీధర్‌బాబు, ఏఎంఓ రఫి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అయూబ్ బాషా, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి, ఏసేపు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

కల్లూరు: ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. 19వ వార్డు నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో టీడీపీ కార్యకర్త గొర్లమాల మద్దిలేటి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చొరవతో రూ.5 లక్షల ప్రమాద బీమా ప్రకటించారు. ఈమేరకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5లక్షల బీమా పత్రాలను అందజేశారు.

● సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1,57,210 చెక్కులను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఉమ్మడి జిల్లాల టీడీపీ సీనియర్ నాయకుడు గౌరు వెంకటరెడ్డి పంపిణీ చేశారు. అర్హులైన లబ్దిదారులు ఎల్లూరు విశ్వనాథ్‌రెడ్డి-87,210, కామిని సుజాత-70,000 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వార్డ్ ఇన్‌చార్జి ప్రభాకర్ యాదవ్, పెరుగు పురుషోత్తంరెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

కర్నూలు కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు, ప్రజాప్రతి నిధులకు ఆహ్వానాలు పంపాలని ఆర్డీవోను ఆదేశించారు. అదనపు ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, డీఆర్వో వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే దస్తగిరి

గూడూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలో సింగిల్‌విండో చైర్మన్‌గా బొజుగు దానమయ్య, డైరెక్టర్లుగా రేమట వెంకటేష్, అల్లిపీరా ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే దస్తగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో చైర్మన్‌గా బొజుగు దానమయ్య, డైరెక్టర్లుగా రేమట వెంకటేశ్వర్లు, అల్లిపీరా ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సింగిల్ విండో చైర్మన్ దానమయ్య, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, అల్లిపీరా మాట్లాడుతూ వ్యవసాయ సహకార పరపతి సంఘంగా ద్వారా రైతులకు రుణాలు అందించి రైతులను, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. చైర్మన్, డైరెక్టర్లను టీడీపీ నాయకులు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు.


సొసైటీ చైర్మన్ దానమయ్య, డైరెక్టర్లలను అభినందిస్తున్న ఎమ్మెల్యే

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జె సురేష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు కురుకుంద రామాంజనేయులు, నాయకులు సృజన్, గుడిపాడు మహేశ్వరరెడ్డి, పౌలు, తెలుగు శ్రీనివాసులు, కౌన్సిలర్లు కోడుమూరు షాషావలి, బుడ్డంగలి, నాగప్ప యాదవ్, చాంద్ బాషా, వీరకుమార్, కురువ హనుమంతు, కళ్యాణ్ రఘు, రవి పాల్గొన్నారు.

'జీవితం ఏపీ ఎన్జీవోలకు అంకితం'


మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగళ్‌రెడ్డి

కర్నూలు కలెక్టరేట్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ప్రస్థానం నుంచి విరమణ వరకు నా జీవితం ఏపీ ఎన్జీవో అసోసియేషన్‌కు అంకితం చేశానని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంగళ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా కర్నూలు జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా, ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్‌గా పని చేశానని, రాష్ట్ర అధ్యక్షులుగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండుసార్లు అవకాశం వచ్చినప్పటికీ కేవలం ఉమ్మడి కర్నూలు జిల్లా ఉద్యోగులకు ఉపాధ్యాయులకు సేవ చేయుటకు పదవులు త్యాగం చేశా నని అన్నారు. కొంత మంది ఇటీవల నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నా రు.. కేవలం జిల్లా అధ్యక్షులు వాళ్లకు కావాలనే ఉద్దేశంతో ఆరోపణలు చేయడం తగదన్నారు. నగర అధ్యక్షుడు కాశన్న, జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి కృష్ణుడు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన వెంకటరమణకాలనీ, ప్రకాష్ నగర్, రోజావీధి, అశోక్‌నగర్, బంగారుపేట, చల్లా కాంపౌండు ప్రాంతాలలో ఆయన పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వారానికి ఒక్కసారి ప్రతి వీధిలో పూడికతీత పనులు చేపట్టాలని, డ్రైనేజీ కాలువలపై ఆక్రమణలు ఉంటే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో సమన్వయం చేసుకుని తొలగించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఏఈ జనార్దన్ ఉన్నారు.

రేపు సాయిబాబా దేవస్థానంలో 'పసుపు-పారాణి'

కర్నూలు కల్చరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని పాతనగరంలోని దక్షిణ షిరిడీ సాయిబాబా దేవస్థానంలో నేడు ముత్తయిదువులకు 'పసుపు-పారాణి' కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు ఆలయ కమిటీ కోశాధికారి ఎస్‌జీ మహాబలేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ఈ కార్యక్రమానికి ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, ఫల, తాంబూలం, గాజులను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

కర్నూలు, జూలై 29(ఆంధ్రజ్యోతి): కె.నాగులాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. కె.నాగులాపురం పోలీసులు తెలిపిన వివరాలివి.. గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన శివ, శాంతిరాజు ఇద్దరు కర్నూలు నగరంలో పనుల నిమిత్తం వెళ్లి తిరిగి బైక్‌పై చనుగొండ్ల గ్రామానికి వస్తుండగా.. ఎదురుగా వస్తున్న ఓ గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివ, శాంతిరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందారని వైద్యులు తెలిపారు. ప్రమాద సంఘటన స్థలాన్ని కె.నాగులాపురం ఎస్‌ఐ శరత్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ ప్రమాద సంఘటన వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉందని తెలిపారు.

నానో ఎరువుల వాడకం పెంచాలి: ఏడీఏ

కోడుమూరు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): నానో ఎరువులతో దిగుబడి పెరగడంతోపాటు భూసారం పెంచుకోవచ్చని ఏడీఏ సాలురెడ్డి తెలిపారు. మండలంలోని ప్యాలకుర్తిలో వ్యవసాయాధికారి రవిప్రకాష్ అధ్వర్యంలో కంది, పత్తి సాగు రైతులకు పలు సూచనలు చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రం సస్యశ్యామలం

● ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
● కమలానగర్‌లో 'తొలి అడుగు'


ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


కరపత్రాన్ని అందిస్తున్న టీడీపీ లీగల్ సెల్ నాయకులు

కల్లూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. మంగళవారం 20వ వార్డు కమలానగర్‌లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. గౌరు చరిత మాట్లాడుతూ ఆర్థికంగా ఎన్ని సమస్యలున్నా సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, వసుంధర, శ్రీకాంత్, నరసింహులు, సుధాకర్, లక్ష్మణ్, శ్రీనివాసులు, భరత్‌నాయక్ పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: నగరంలోని 45 వవార్డు అశోక్ నగర్, లేబర్ కాలనీల్లో మంగళవారం సాయంత్రం టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్ గౌడ్ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్ భట్, మాదన్న, శేషన్న, ధణరెడ్డి, రవి, గిత్త, రమేష్ సురేష్, వార్డు ఇన్‌చార్జి మాణిక్యమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జి కొరకంచే రవీ, సుంకన్న పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ నాయకుడు సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, సోమేశ్వరరెడ్డి, మహబూబ్ బాషా, కురువ రవీంద్ర, అక్బర్ బాషా, గఫూర్, మహ్మద్ రఫీ, రమణయ్య, కురువ సుంకన్న పాల్గొన్నారు.

సీఐని సస్పెండ్ చేయాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై లాఠీచార్జి చేయించిన సీఐ శ్రీనివాసరావును సస్పెండ్ చేయాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం గడియారం ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పరాదని కోరుతూ నెల్లూరులో గత 14 రోజులుగా పోరాటం చేస్తున్న మున్సిపల్ కార్మికులపై అమానుషంగా లాఠీ చార్జీ చేయించడము సరికాదన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అబ్దుల్‌దేశాయ్, ప్రధాన కార్యదర్శి విజయరామాంజనేయులు, ఖాజాపాష, నాగస్వాములు పాల్గొన్నారు.

● మత సామరస్యాన్ని కించపరిచేలా మాట్లాడిన శ్రీశైలం చెక్‌పోస్టు సెక్యూరిటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఏ.సుభాన్ డిమాండ్ చేశారు.

● బుధవారపేట 15 వార్డు కొత్త బ్రిడ్జి నుంచి హంద్రీ వెంట ఉండే కంపచెట్లను తొలగించాలని సీపీఎం నగర కార్యదర్శివర్గసభ్యులు కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు హంద్రీ వెంట కంపచెట్లను పరిశీలించారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

సి.బెళగల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కమ్యూనిటీ మొబైలేజన్స్ అధికారి ధన్‌రాజు అన్నారు. మంగళవారం సి.బెళగల్‌లోని కస్తూర్బా ఆదర్శ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆయన వెంట మండల విద్యాధికారులు జ్యోతి, ఆదాంబాషా ఉన్నారు.

గ్రేడ్-2 వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు కలెక్టరేట్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గ్రేడ్-2 వీఆర్వోల సమస్యలను పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్, ట్రెజరర్ కుమార్ మంగళవారం కలెక్టరేట్ పరిపాలనా అధికారి శివరామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీఎల్ సర్వే ట్రైనింగ్ పరక్షలో ఉత్తీర్ణత పొందిన 15 మంది వీఆర్వోలకు రెగ్యులరేజేషన్ చేసి పే స్కేల్ అమలు చేయాలన్నారు.

సియాసిస్ ఫెర్టిలిటీ కేంద్రం తనిఖీ

కర్నూలు హాస్పిటల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సంతానోత్పత్తి కేంద్రాల పనితీరును పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలన్న వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో మంగళవారం నగరంలోని సియాసిస్ ఫెర్టిలిటీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. డీఎంహెచ్‌వో శాంతికళ కేంద్రంలోని ఫార్మ్- 6, 9, 10, 12, 13, 15 రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి నాగప్రసాద్‌బాబు, డెమో శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, సుమలత పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి

కర్నూలు అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న బీఈడీ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం తాండ్రపాడు సమీపంలోని రాఘవేంద్ర, శ్రీలక్ష్మి శ్రీనివాసా బీఈడీ కళాశాలల ఎదుట ఆందోళన చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, ఏఐఎస్ఏ జిల్లా ఎస్.నాగర్జునలతో కలిసి బీఈడీ కళాశాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఈడీ కళాశాలలు అవినీతి, అక్రమాలకు నిలయాలుగా మారాయని మండిపడ్డారు. యాజమాన్యాలు సొంత అజెండా ఏర్పాటు చేసుకుని ఎన్‌సీటీఈ నిబంధనలకు విరుద్ధంగా అఫ్లియేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఈవిషయంపై యూనివర్సిటీ అధికారులు స్పందించక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆలీ, ఖాజా హుస్సేన్, చంటి, కళాకార్, అశోక్, వెంకట్ పాల్గొన్నారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రిని కలిసిన ఎంపీ

కర్నూలు అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సహకరించాలని కోరారు.


కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ

ఎమ్మెల్యే ఎదుట ఉల్లి రైతుల ఆవేదన

కోడుమూరు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): అరకొర వర్షాలకు ఉల్లి నాట్లు వేసుకున్నామని, తీరా వర్షం లేకపోవడంతో ఉల్లి నారు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని వెంకటగిరి రైతులు ఎమ్మెల్యే దస్తగిరి ఎదుట వాపో యారు. మంగళవారం వెంకటగిరిలో సుపరిపాలన తొలి అడుగులో భాగంగా ఎమ్మెల్యే, నాయకులతో కలిసి ఇంటింటికి కరపత్రాలు అందించారు. అలాగే గుండెపోటుతో మరణించిన టీడీపీ కార్యకర్త దూదేకుల పెద్దయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామక్రిష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజు, సర్పంచ్ సద్దల బాలకృష్ణ, నాయకులు నారాయణ, చంద్ర, పెద్ద గిడ్డయ్య, క్రిష్ణ, రవి, శ్రీరాములు, గిడ్డయ్య, నాగరాజు పాల్గొన్నారు. గోరంట్ల పంచాయతీలో బూత్ ఇన్‌చార్జి గిరిప్రకాష్, కో-కన్వీనర్లు గిడ్డప్ప, చిరంజీవి, గిడ్డయ్య, మద్దిలేటిలను ఎమ్మెల్యే దస్తగిరి సన్మానించారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మురళీమోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో 17 కోర్సులు ఉన్నాయని, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులను పూర్తి చేసి కళాశాలలో సమర్పించాలని సూచించారు.

అర్హులందరికీ 'తల్లికి వందనం'



మాట్లాడుతున్న టీడీపీ పరిశీలకుడు ఆదినారాయణ

తుగ్గలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ 'తల్లికి వందనం' అమలు చేశామని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు తలారి ఆదినారాయణ, నాయకులు మనోహర్ చౌదరి, చక్రపాణి, శివరామ చౌదరి అన్నారు. మంగళవారం పగిడిరాయి కొత్తూరులో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని విచారించారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైందన్నారు ఈశ్వర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, తిరుపాల్ నాయుడు, చంద్ర ఉన్నారు.

పంట నమోదు చేసుకోవాలి

వెల్దుర్తి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని ఏవో అక్బర్‌బాషా సూచించారు. మంగళవారం మల్లెపల్లి, బొమ్మిరెడ్డిపల్లె, వెల్దుర్తి గ్రామాల్లో పంట నమోదును తనిఖీ చేశారు. అన్నదాత సుఖీభవ, పంటల బీమా, సున్నావడ్డీ, బ్యాంకులో పంటరుణాలు, కనీస మద్దతుధర పథకాలు అందాలంటే ఈ-క్రాప్ తప్పనిసరన్నారు.



నమోదును పరిశీలిస్తున్న ఏవో

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న ఏడీఏ వేదమణి

దేవనకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పంటలు తెగుళ్లబారిన పడకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని డీఆర్‌సీ ఏడీఏ వేదమణి సుచించారు. మంగళవారం తెర్నేకల్లు గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో రైతులకు శిక్షణ నిర్వహించారు. పత్తి ప్రారంభంలో యూరియా ఎకరాకు 10 కేజీలకు మించి చల్లితే రసం పిల్చే పురుగు, దోమ వ్యాప్తి చెందుతుం దన్నారు. రసం పిల్చే పురుగుల నివారణకు పసుపురంగు జిగురు అట్టలు ఎకరాకు 20చొప్పున, నియోనికోటినాయిడ్, ఎసిటమప్రిడ్, వేపనునెను పిచికారీ చేసుకోవాలన్నారు. వేరుశనగలో ఊడల వృద్ధికి ఎకరాకు 200 కేజీల జిప్సంను వేయాలన్నారు. ఏవో ఉషారాణి, ఏఈవో మల్లికార్జున, అబ్దుల్‌సలాం, వీఏఏ షబాన ఉన్నారు.

జూదరుల అరెస్టు

ఆదోని రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆరేకల్లు శివార్లలో జూదరులను అరెస్టు చేసినట్లు తాలుక ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. సమాచారం మేరకు.. దాడులు నిర్వహించి, ఆదోనికి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. సెల్‌ఫోన్లతోపాటు రూ.35వేలు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారని, కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సచివాలయం ఖాళీ

- హాలహర్వి మండలంలో 150 ఉద్యోగులకు గాను పనిచేస్తున్నది 70 మంది
- బదిలీల్లో మితిమీరిన రాజకీయ జోక్యం
- డిప్యుటేషన్‌పై వెళుతున్న ఉద్యోగులు



సిబ్బంది కొరత ఉన్న హాలహర్వి సచివాలయం

హాలహర్వి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలో సచివాలయ ఉద్యోగుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సచివాలయాలు ఉండగా, 150 మంది ఉద్యోగులు అవసరం. అయితే కేవలం 70 మంది మాత్రమే పనిచేస్తున్నారు.

మితిమీరిన రాజకీయ జోక్యం

సచివాలయ ఉద్యోగుల విషయంలో రాజకీయ నాయకుల జోక్యం ఎక్కువైనట్లు ఆరోపణలు ఉన్నాయి. అపాయింట్‌మెంట్ పొందిన ఉద్యోగులు మూడేళ్ల అనంతరం రాజకీయ నాయకులను ఆశ్రయించి డిప్యుటేషన్‌పై వెళ్లిపోతున్నారు. సచివాలయ ఉద్యోగుల విషయంలో రాజకీయ నాయకులు అధికారులపై తీవ్రంగా ఒత్తిడి తెచ్చి తమకు అనుకూలమైన వారికి డిప్యుటేషన్లు ఇప్పిస్తున్నట్లు సమాచారం.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..

సచివాలయ ఉద్యోగులకు తాజా నిర్వహించిన బదిలీల్లోనూ హాలహర్వి మండలానికి పూర్తిస్థాయిలో ఉద్యోగులను కేటాయించలేని సమాచారం. మొదట మారుమూల మండలాల ఖాళీను భర్తీ చేసిన అనంతరమే నియోజకవర్గ, జిల్లా, మండల కేంద్రాలకు ఉద్యోగులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. అయినా ఆ ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు.

ప్రజల అవస్థలు..

ప్రభుత్వం ప్రజలకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, ధ్రువపత్రాలు, వివిధ రకాల సేవలన్నీ సచివాలయాల ద్వారానే నిర్వహిస్తున్నారు. అయితే ఉద్యోగుల కొరతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అలాగే సర్వేలు, అభివృద్ధి పనులను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు అధికారులే వాపోతున్నారు.

సిబ్బంది కొరత ఇలా..

మండలంలోని 15 సచివాలయాలకు 150 మంది ఉండాల్సిందిగా కేవలం బదిలీల్లో 70 మంది మాత్రమే ఈ మండలానికి రావడం జరిగింది. మిగతా 80 మంది ఉద్యోగులు ఇక్కడ భర్తీ కాలేదు. ఒక్కొక్క సచివాలయానికి ఒకరు ఇద్దరు మాత్రమే ఉన్నారు. దీంతో అన్ని శాఖల పనిభారం అంతా ఆ ఒకరిద్దరిపైనే పడడంతో నలిగిపోతున్నారు. ఉన్న వాళ్లు సైతం పనిభారంతో మరో మండలానికి వెళ్లాలని ప్రయత్నాలు ముమ్మరంగా పైరవీలు కొనసాగిస్తున్నారు. గ్రామాల ప్రజలు సిబ్బంది లేకపోవడం వల్ల తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

ఉద్యోగులను నియమించాలి



ఇటీవల సచివాలయ ఉద్యోగులకు బదిలీలు నిర్వహించినా మండలానికి కేటాయించకపోవడం విచారకరం. 80 మంది ఉద్యోగులు కొరత ఉంటే పనులు ఎలా అవుతాయి. కలెక్టర్ స్పందించి మండలానికి సిబ్బందిని నియమించాలి.

- బసప్ప, మాజీ ఎంపీపీ, చింతకుంట

ఉద్యోగుల కొరతతో ఇబ్బందులు..



మండలంలో సచివాలయ ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. ఉన్న సిబ్బందికే అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నాం. సర్వేలు, సంక్షేమ పథకాల అమలులో మనమే ముందుంటున్నాం. సిబ్బంది కొరత తీర్చాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- వరలక్ష్మి, ఎంపీడీవో

చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు



మాట్లాడుతున్న వైకుంఠం శివప్రసాద్

ఆస్పరి, జూలై 29(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం జ్యోతి, వాల్మీకి ఫెడరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. మంగళవారం ఆస్పరిలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కృష్ణయాదవ్, వెంకటేష్, వెంకటేష్‌చౌదరి, అరవింద్, గోవిందు ఉన్నారు.

మోడల్ స్కూల్‌కు 'విద్యార్థి బస్సు'



వెల్దుర్తిలో బస్సును ప్రారంభిస్తున్న నాయకులు

వెల్దుర్తి టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణం నుంచి కృష్ణగిరి మోడల్ స్కూల్‌కు విద్యార్థుల సౌకర్యార్థం మంగళవారం ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. టీడీపీ నాయకులు జ్ఞానేశ్వర్ గౌడ్ బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సును ఏర్పాటు చేయించామన్నారు. విద్యార్థులు బడికి వేళ్లే సమయానికి అనుగుణంగా బస్సు వెళుతుందన్నారు. బలరాం గౌడ్, తల్లిదండ్రులు గంగాధర్ నాయుడు, సూర్యచంద్ర, బజారు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడిరైతుల కోసమే గోకులం షెడ్లు

మద్దికెర, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పాడిరైతుల కోసమే గోకులం షెడ్లు మంజూరు చేసినట్లు పశుసంవర్ధక అధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పశువైద్యశాలలో రైతులకు రాయితీ దాణాను పంపిణీ చేశారు. అనంతరం గోకులం షెడ్లను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేసే గోకులం షెడ్లను పాడి రైతులకే ఇవ్వాలన్నారు. ఏడీఏ వెంకటరమణయ్య, పశువైద్యాధికారి లక్ష్మన్న ఉన్నారు.



దాణా పంపిణీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసులు

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి సూచించారు. మంగళవారం మదనంతపురం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాకాలం ముగిసే వరకు నీటిని వేడి చేసి, చల్లార్చి, వడబోసి తాగాలన్నారు.

కార్మికులను ఆదుకోవాలి

పత్తికొండ టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయకుడు రవిచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలోమాట్లాడుతూ వీరికి లేబర్ ఆఫీసు నుంచి గుర్తింపు కార్డులను మంజూరు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. మంజు, యల్లప్ప, డీవైఎఫ్ఐ నాయకులు దుగ్గెన్న పాల్గొన్నారు.

రైతుకు ఆర్థిక సాయం

తుగ్గలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెంది నష్టపోయిన రైతు మోట సుంకన్నకు టీడీపీ నాయకులు జయచంద్రగౌడ్, రాజేంద్రగౌడ్ మంగళవారం ఆర్థిక సాయం చేశారు. రక్షక్ సేనా సంస్థ తరపున చెన్నంపల్లి పంచాయతీలో బాధితులను ఆదుకుంటామన్నారు. సర్పంచ్ రంగమ్మ, ఉరుకుంద గౌడు, రామాంజనేయగౌడ, శేఖర్ గౌడ్ ఉన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పాలన

వెల్దుర్తి టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నట్లు అభివృద్ధే టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు ఆదేశాల మేరకు మంగళవారం వెల్దుర్తిలో 'సుపరిపా లనలో తొలి అడుగు' నిర్వహించారు. వడ్డె మహేష్, నాయకంటి గిడ్డయ్య ఉన్నారు.

చెరువులు నింపాలి

తుగ్గలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులను హంద్రీనీవా నీటితో నింపాలని సీపీఎం నాయకులు ఆనంద్‌బాబు, శ్రీరాములు డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగునీటి సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యాయన్నారు. రంగరాజు, నరసప్ప తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులను మినహాయించాలి

ఆదోని అగ్రికల్చర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రాంభించిన పీ-4 పథకం నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని ఎస్టీయూ కన్వీనర్ వీరచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ హెచ్‌ఎం అయిదు, టీచర్లు రెండు కుటుంబాల చొప్పున దత్తత తీసుకోవాలని బలవంతం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు.

కుళ్లిన టమోటా.. పాడైన ఉల్లిగడ్డలు

- హొళగుంద కస్తూర్బాలో ఇంతే
- ఇప్పటికే ఓసారి 'ఆంధ్రజ్యోతి'లో కథనం.. అయినా అంతే..!





కుళ్లినా ఇవే తినాలి.. టమోటాలు, ముదిరిన దొండకాయలు



తింటే అంతే.. ఫంగస్ ఏర్పడ్డ ఉల్లి

హొళగుంద, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో నిర్వాహకులు ఆటలాడుతున్నారు. తాజా కూరగాయలతో వంట చేయకుండా కుళ్లిన టమోటా, బూజు పట్టిన బీట్రూట్, పాడైన ఉల్లిగడ్డ, ముదరిన దొండకాయలతో వంట చేస్తున్నారు. దీంతో విద్యార్థినుల ఆరోగ్యానికి ప్రమాదం పొంచిఉంది. గతంలో కూడా ఇలానే చేస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక వెలుగులోకి తెచ్చింది. అయినా షరా మామూలుగానే మారింది. పాఠశాలలో 210 మంది విద్యార్థినులు 6 వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్నారు.

మంగళవారం ఇదీ పరిస్థితి..

మంగళవారం పాఠశాలను పరిశీలించగా నిర్వాహకులు బూజుపట్టిన క్యారెట్, దొండకాయతో సాంబారు, కుళ్లిన టమోటాతో రసం చేశారు. గత్యంతరం లేక బలవంతంగా భోజనం చేసినట్లు విద్యార్థులు వాపోతున్నారు. కూరగాయల గదిని పరిశీలించగా కుళ్లిన పచ్చిమిరప, పురుగులు పట్టిన ముల్లంగి, ఫంగస్ ఉల్లిగడ్డలు కనిపిచాయి.


విద్యార్థులతో చెలగాటం

28-2-2025న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు

ఇలాంటి ఆహారం తింటే పిల్లల పరిస్థితి ఏంటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రూ.లక్షల్లో ఖర్చు చేస్తూ, నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వాలని ఆదేశిస్తున్నా అవి క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. నాసిరకం భోజనంపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపణలు వినబడుతున్నాయి.

- ప్రిన్సిపాల్ దివ్యభారతిని వివరణ కోరగా కాంట్రాక్టర్‌పై అధికారులకు ఫిర్యాదు చేశాం, పునరావృతం కాకుండా చూస్తామని యథాప్రకారం సెలవిచ్చారు.

వంతెన పనులు ప్రారంభించాలి : సబ్ కలెక్టర్



స్థల పరిశీలన చేస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని డీఎస్పీ కార్యాలయం సమీపంలో నిర్మించనున్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులను త్వరగా ప్రారంభించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రైల్వే, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ విద్యుత్ విభాగాల ఇంజనీర్లతో కలిసి క్షేత్రస్థాయిలో వంతెన నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. వంతెన నిర్మాణం పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. తహసీల్దార్ రమేష్, ఆర్‌అండ్‌బీ ఈఈ పద్మనాభరెడ్డి, రైల్వే ఇంజనీర్లు కనకదుర్గరావు, సత్యనారాయణ, డీఐ ఆఫ్ సర్వేయర్స్ వేణుసూర్య, ఎంఈ గోపీనాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి : ఆర్డీవో



కస్తూర్బాలో బియ్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

మద్దికెర, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ఉత్తరం గ్రూపులో చేస్తున్న రీ సర్వేను వేగవంతం చేయాలని ఆర్డీవో భరత్ నాయక్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఆన్‌లైన్‌లో రీ సర్వే వివరాల నమోదును పరిశీలించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. కూరగాయలు, బియ్యం, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు సులభ పద్ధతిలో బోధించాలన్నారు. విద్యార్థినులు బాగా చదువుకోవాలని క్రమశి క్షణతో కూడిన విద్యతో ప్రయోజకులు అవుతారన్నారు. తహసీల్దార్ గుండాల్ నాయక్, వీఆర్వో రంగస్వామి, సర్వేయర్లు ఉన్నారు.

గోబీ సెంటర్లపై దాడులు

ఆదోని టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలోని గోబీ సెంటర్లపై మంగళవారం మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా. సందీప్ కుమార్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి, పరిసరాలను పరిశీలించారు. తినుబండారాలలో మోతాదుకు మించి రంగులను వేసినట్లు గుర్తించి సీజ్ చేశారు. యజమానులకు జరిమానాల విధించారు. ఇకపై నిత్యం దాడులను కొనసాగిస్తామని, నిబంధలను ఉల్లంఘించినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఆరోగ్యాధికారి

ఇంటి వద్ద రేషన్ ఇవ్వడం లేదు

- తహసీల్దార్‌కు వృద్ధుల ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వృద్ధులు

ఆలూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తమకు డీలర్లు ఇంటి వద్దకు వచ్చి రేషన్ ఇవ్వడం లేదని వృద్ధులు ఆరోపించారు. మంగళవారం మండలంలోని మొలగవల్లి గ్రామానికి చెందిన వృద్ధులు తహసీల్దార్ శోభ సువర్ణమ్మకు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ డీలర్లతో సమావేశం నిర్వహించి నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు : సీఐ

పత్తికొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించకుండా ఆటోలను పార్క్ చేయాలని సీఐ జయన్న సూచించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలిపడంతో వెనుకవచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పల్లెలకు వెళ్లే ఆటోలను రద్దీప్రాంతాల్లో నిలపడంతో గుత్తిసర్కిల్, అంబేడ్కర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు.



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ జయన్న



వివాద స్థలంలో విచారణ చేస్తున్న అధికారులు

తెర్నేకల్లులో స్థల వివాదం

- రెండు సామాజిక వర్గాల మధ్య వాగ్వాదం
- అధికారుల జోక్యంతో సమస్య పరిష్కారం

దేవనకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తెర్నేకల్లు గ్రామంలోని ఓ స్థలం విషయంలో రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఓ ఆలయం వద్ద కొండ కింద భాగంలో ఖాళీ స్థలాన్ని ఓ సామాజిక వర్గంవారు శుభ్రం చేశారు. మంగళవాం అదే స్థలంలో మరో సామాజిక వర్గానికి చెందినవారు మృతదేహాన్ని పూడ్చేందుకు గొయ్యి తవ్వుతుండగా అడ్డుకున్నారు. చివరకు గ్రామస్థుల ఫిర్యాదుతో తహసీల్దార్ రామాంజనేయులు, సీఐ వంశీనాథ్ చేరుకొని సర్వే చేశారు. సదరు సర్వే నెం.46 భూమి గ్రామకంఠానికి చెందినదిగా నిర్ధారించారు. గ్రామ పంచాయతీ తీర్మాణం మేరకు స్థలాన్ని కేటాయిస్తామన్నారు. దీంతో అక్కడే మృతదేహానికి అంత్యక్రియాలు నిర్వహించారు. ఆర్ఐ విజయబాస్కర్, సర్వేయర్ ఆశ్వర్థ, ట్రైనీ ఎస్ఐ నరేష్, వీఆర్వో షఫి, హనుమన్న ఉన్నారు.

చెట్ల కిందే చదువులు

● ప్రాథమిక పాఠశాలలోనే ఉన్నత పాఠశాల కొనసాగింపు
● 330 మంది విద్యార్థులకు మూడే గదులు
● నిధులు లేక గ్రహణం పట్టిన నూతన పాఠశాల భవనాలు



సూగూరు జడ్పీహెచ్ పాఠశాలలో చెట్ల కిందే విద్యాబోధన



గదులు లేక కాంపౌండు హాలులో తరగతుల నిర్వహణ



నూతనంగా నిర్మిస్తున్న జడ్పీ ఉన్నత పాఠశాల

మంత్రాలయం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. 330 మంది విద్యార్థులకు మూడే గదులలో విద్యాబోధన సాగుతుంది. ఏడు సెక్షన్లుకు, 7మంది ఉపాధ్యాయులు బోధిస్తుండగా.. ఒకే గదిలో రెండు తరగతులు, కాంపౌండులో మూడు తరగతులు, చెట్ల కింద రెండు తరగతులను నిర్వహిస్తూ విద్యాబోధన చేస్తున్నారు. మరో రెండు గదుల్లో ప్రాథమిక పాఠశాల కొనసాగుతోంది. అందులో 188మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఆరేళ్లుగా ప్రాథమిక పాఠశాలలోనే ఉన్నత పాఠశాల కొనసాగుతుండటంతో గదులు లేక చెట్ల కింద, కాంపౌండు హాలులో, గోడల చాటున విద్యాబోధన చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనికి ప్రహరీ కూడా లేదు. కుక్కలు, పందులు, మూగజీవాలు పాఠశాల లోపలికి వచ్చి వెళ్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం 'నాడు-నేడు' కింద 12 గదుల నిర్మాణాన్ని మొదలు పెట్టి డబ్బు కొరత కారణంగా ఎనిమిది గదులకు కుదించారు. అయితే.. నేటికీ అవసరమైన నిధులు విడుదల కాకపోవడంతో ఐదు గదులు మాత్రమే అరకొరగా పూర్తి చేశారు. విద్యార్థులకు, పాఠశాలకు అవసరమైన వంట గది, మరుగుదొడ్లు, నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఆరేళ్లు కావస్తున్నా ఉన్నత పాఠశాల భవనానికి గ్రహణం వీడటం లేదు. ఒకే ఆవరణలో పది తరగతులు నిర్వహించడం దాదాపు 500 మంది విద్యార్థులకు ఐదు గదుల్లో విద్యాబోధన చేయాలంటే ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. ఇందులో ప్రధానోపాధ్యాయులు, స్టోర్ రూం సరిపోగా, మిగతా ఐదు గదుల్లో పది తరగతులు కొనసాగుతున్నాయి. అదే పరిసరాల్లో ఒక గదిలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. ప్రహరిగోడ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు తమ పిల్లలను పంపాలంటే తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఉన్నత పాఠశాల గదుల నిర్మాణాలు పూర్తి చేసి ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలలోకి మార్చి విద్యాబోధనకు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠాలు బుర్రకు ఎక్కడం లేదు



సరైన గదులు లేకపోవడంతో చెట్లకిందనే చదువు చెబుతున్నారు. దీంతో రోడ్డుపక్కనే ఆటోలు, కార్లు, మోటారు సైకిళ్ల శబ్దాలతో చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నాం గురువులు చెప్పే పాఠాలు బుర్రకు ఎక్కడం లేదు.

● గౌతమి, విద్యార్థిని, 8వ తరగతి

నూతన పాఠశాలను పూర్తి చేయాలి



ప్రాథ మిక పాఠశాలలోనే ఉన్నత పాఠశాల కొనసాగిస్తుండటంతో టీచర్లు చెప్పే చదువు అర్థం కావడం లేదు. కొత్తగా నిర్మిస్తున్న పాఠశాలకు డబ్బులు ఇచ్చి త్వరగా పూర్తిచేసి కొత్త పాఠశాలలోకి మార్చాలి. అధికారులు కొత్త భవనాల్లోకి పాఠశాలను మార్చి బాగా చదివేలా చూడాలి.

● మాలిక్, 9వ తరగతి విద్యార్థి

సొంత ఖర్చుతో వంటగది, మరుగుదొడ్లను నిర్మించాను



ఇరుకు గదుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతూ వస్తున్నాం. నూతనంగా నిర్మించిన 8గదుల్లో అతి కష్టమ్మీద గ్రామస్థుల సహకారంతో ఐదు గదులు పూర్తి చేశాం. గదులు పూర్తయినా వంటగది, బాలికలకు మరుగుదొడ్లు లేకపోవడంతో దాదాపు రూ.6 లక్షలు నా సొంత డబ్బుతో ఖర్చు చేసి వంటగది, మరుగుదొడ్లను నిర్మాణం చేయిస్తున్నా. గ్రామ పెద్దలతో మాట్లాడి పాఠశాల ముందు ఉచితంగా గ్రావెల్ వేసి సహకరిస్తామన్నారు.

● లచ్చప్ప, ప్రధానోపాధ్యాయులు, సూగూరు, జడ్పీహెచ్ఎస్

నిత్యాన్నదానానికి విరాళం



దాతకు స్వామి వారి ప్రసాదాలను అందిస్తున్న దృశ్యం

కౌతాళం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో భక్తులకు అందిస్తున్న నిత్యఅన్నదాన పథకానికి మంగళవారం ఓ భక్తుడు రూ.50వేల నగదును విరాళంగా అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్ ,ఈఓ విజయరాజు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ దేవస్థానం లో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకంకు కర్నూలు వాస్తవ్యులు శివ రామ కృష్ణయ్య శెట్టి కుటుంబ సభ్యులు రూ.50వేల నగదును ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు స్వామి సన్నిధిలో పూజలు చేయించి స్వామి వారి లడ్డూ ప్రసాదాలను అందజేశారు ఆలయ అర్చకులు లోకరాజ్ స్వామి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



పోస్టర్లు విడుదల చేస్తున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

గోనెగండ్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేవరకు పోరాటం చేస్తామని యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమేష్ చౌదరి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కార్మికులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల చిరకాల కోరిక అయిన డైరెక్ట్ పేమెంట్, రెగ్యూలరైజేషన్ తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రవీణ్, జావిద్, శ్రీను, పోతన్న యూనుష్, పవన్, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత



కడివెళ్ల గ్రామంలో నీటిట్యాంకు చుట్టూ నిలిచిన మురుగు

ఎమ్మిగనూరు జూలై 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కడివెళ్ల గ్రామంలో ఉన్న మిని నీటి ట్యాంకు చుట్టు అపరిశుభ్రతం పేరుకుపోయింది. ట్యాంకు నుంచి వృధాగా పోతున్న నీరు ట్యాంకు చుట్టూ నిలవటంతో అపరిశుభ్రంగా కనిపిస్తోంది. అంతేగాక చాలా రోజుల నుంచి నీరు నిలవటంతో పాచి పేరుకోపోయింది. అపరిశుభ్రంగా ఉన్న నీటిలో నిలబడే బిందేల్లో నీటిని నింపుకోవాల్సిన దుస్థితి. గ్రామంలోనికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే నీటి ట్యాంకు ఉన్నా దాని బాగోగులు గురించి ఎవరు పట్టించుకోవటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి వెంటనే నీటి ట్యాంకు చుట్టు పేరుకుపోయిన పాచి, గడ్డి, నిలిచిన నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు

మంత్రాలయం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై పోరాటం చేసేందుకు ప్రతి కార్యకర్త పోరాటానికి సిద్ధం కావాలని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, నారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం మంత్రాలయం ప్రైవేట్ అతిథి గృహంలో రెండురోజుల పాటు సీపీఎం నిర్వహించిన శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిశాయి. శిక్షణా తరగతుల్లో తిక్కన్న, జయరాజు, రాముడు, ప్రాణేష్,అనుమంతు, రాము, సురేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నందవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం చిలకలడోన గ్రామానికి చెందిన దుబ్బ మహానంది కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం వేకువ జామున మృతి చెందినట్లు ఎస్ఐ కేశవ తెలిపారు. సోమవారం రాత్రి మహానంది ఎమ్మిగనూరులో పనులు ముగించుకుని మోటర్ బైక్‌పై తిరిగి చిలకలదోన గ్రామానికి వెళుతుండగా మంత్రాలయం నుంచి వస్తున్న కారు హలహర్వి సమీపంలోని ఆంజినేయ స్వామి గుడి దాటిన తరువాత అతి వేగంగా వస్తూ ఢీకొట్టింది. ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. భార్య గోవిందమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుటుంబానికి మంత్రాలయం వైసీపీ నాయకులు ఆర్థికసాయం అందించారు

డీఎస్పీ ఉపేంద్ర బాబుకు ఘనంగా వీడ్కోలు

ఎమ్మిగనూరు జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు సబ్‌డివిజనల్ డీఎస్పీగా పనిచేస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలు దిశా పోలీసుస్టేషన్‌కు బదిలీ అయిన డీఎస్పీ ఉపేంద్ర బాబును పోలీసులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పట్టణంలోని బాబు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మిగనూరుపట్టణ, రూరల్, గోనేగండ్ల, సీఐలు శ్రీనివాసులు, మధుసూదన్‌రావు, విజయ్ భాస్కర్, కోసిగి, కౌతాళం, మంత్రాలయం సీఐలు మంజునాథ్, అశోక్ కుమార్, రామాంజనేయులులు మాట్లాడుతూ డీఎస్పీ ఉపేంద్ర బాబు ఎమ్మిగనూరు డివిజన్ ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం డీఎస్పీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా పోలీసు స్టేషన్ల ఎస్ఐలు శ్రీనివాసులు, మహేశ్వర రెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాసులు, శివాంజల్, కేశవ్, ఏఎస్ఐ కిష్టప్ప నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణపంచాయతీ సక్రమంగా నిర్వహించాలి

గోనెగండ్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆదోని డివిజన్ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీ అధికారులు స్వర్ణపంచాయతీ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదోని డివిజన్ డీఎల్‌పీవో తిమ్మక్క కోరారు. మంగళవారం ఆమె గోనెగండ్లలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అందులో వర్మీకంపోస్టు ఎరువు ఎంత ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో పర్యటించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ అనంతశయన, కార్యదర్శి సతీష్, పంచాయతీ సిబ్బంది మలాంగ్‌బాషా, సుబాన్, అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కోతుల బెడద



స్కూల్ గదుల కిటికీలు తెరిచేందుకు ప్రయత్నిస్తున్న కోతులు

గోనెగండ్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మోడల్ స్కూల్ విద్యార్థులకు కోతుల బెడద తీవ్రమైంది. ప్రతి రోజు కోతులు తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థుల బ్యాగ్‌లను చిందరవందర చేయడం వాటిల్లో ఉన్న తిను బండరాలను బయకు తీసుకురావడం కోతులకు పరిపాటిగా మారింది. మంగళవారం రోజులు పాఠశాల విద్యార్థులు ఉదయం ప్రార్థన చేస్తుండగా దాదాపు 10 కోతులు పాఠశాల భవనం వెనకవైపు కిటికిలో నుంచి తరగతి గదుల్లోకి దూరి విద్యార్థులు తినేందుక తెచ్చుకున్న క్యారియర్‌లను బయటకు తీసుకువచ్చి తిని పారవేసి వెళ్లాయి. పాఠశాల సిబ్బంది తగు చర్యలు తీసుకోని కోతుల నుంచి ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

చేనేతలకు ఆర్థిక భరోసా కల్పించిన వైసీపీ

ఎమ్మిగనూరు జూలై29(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు వైసీపీ ప్రభుత్వం నేతన్న నేస్తంతో ఆర్థిక భరోసా కల్పించిందని వైసీపీ పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప అన్నారు. మంగళవారం పట్టణంలోని 1, 2, 3,4 వార్డుల్లో తేరుబజార్, ఎన్టీఆర్ కాలనీ, శివన్ననగర్ ప్రాంతాల్లో వైసీపీ రాష్ట్రకమిటీ పిలుపుతో సమావేశాలు నిర్వహించారు. సమావేశంలో కౌన్సిలర్లు గడిగే అంపమ్మ, నాయకులు గడిగే చంద్ర, యం కే శివన్న, శివ, బజారి రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మమ్మ అవ్వకు వెండి కిరీటం సమర్పణ

ఎమ్మిగనూరు జూలై29(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో వెలసిన మహాయోగి లక్ష్మమ్మ అవ్వ ఆలయంలో విగ్రహానికి పూర్వపు విద్యార్థులు 160 గ్రాముల వెండి కిరీటాన్ని విరాళంగా అందజేశారు. మంగళవారం పూర్వపు విద్యార్థులు పీసీ రఘునాథ్, రాఘవరెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్, మిత్రబృందం ఆలయంలో మహాయోగి లక్ష్మమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వెండికిరీటాన్ని తొడిగారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సూపరిడెంట్ మద్దిలేటి పూర్వపు విద్యార్థులను అభినందించారు.

ఏరులై పారుతున్న కర్ణాటక మద్యం



ఓ దుకాణంలో అమ్ముతున్న కర్ణాటక మద్యం

కౌతాళం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వద్ద కర్ణాటక మద్యం ఏరులై పారుతున్నా ఎక్సైజ్ పోలీసులు అక్రమ మద్యం అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని చెప్పవచ్చు.. శ్రావణ మాసంలో భక్తులు స్వామిని ఎంతో భక్తితో పూజిస్తుండగా కొందరు పరిసరాలలో మద్యం అమ్ముతూ క్షేత్ర మహిమను అపవిత్రం చేస్తున్నారని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం విక్రయదారులు ఆలయ పరిసరాలలోనే మకాం వేసి మద్యం ప్రియులకు అధిక ధరలకు అమ్ముతూ భక్తుల మనోభావలను దెబ్బతిస్తున్నారు. విక్రయదారులు పోలీసులకు మాముళ్ళు అందించడంతో ఇలా యధేచ్ఛగా వ్యాపారాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనా స్వామి క్షేత్రం వద్ద మద్యాన్ని అరికట్టి విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలని భక్తులు కోరుకుంటున్నారు.

షోకాజ్ నోటీసులు జారీ

ఎమ్మిగనూరు జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న సచివాలయం -1, కోటావీదిలో ఉన్న సచివాలయాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సమయపాలన పాటించని సచివాలయ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. అలాగే సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. సర్వీసులు, గ్రీవెన్స్‌లు తనిఖీలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మెప్మా పీవో జయవర్ధన్, మేస్త్రీ రాజాహ్మద్ పాల్గొన్నారు.

కర్నూలుకు బీజేపీ నాయకులు

నందవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): నందవరం మండలం నుంచి మంగళవారం బీజేపీ నాయకులు కర్నూలుకు బయలుదేరి వెళ్లారు. కర్నూలుకు రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ రావడం, నందవరం దేశాయి నెట్ వర్క్ అధినేత గురాజారావు బీజేపీలో చేరుతుండంతో దాదాపు నందవరం మండలంలోని మాచాపురం, పూలచింత, నాగలదిన్నె, నందవరం గ్రామాల నుంచి 200 మంది కార్యకర్తలతో బయలు దేరారు. కర్నూలులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అధ్యక్షతన పార్టీలో చేరారు. ప్రధానమంత్రి మోదీ చేపడుతున్న సంస్కరణలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీ తీర్థం పుచ్చుకున్నట్లు గురురాజారావు తెలిపారు. ఆయనతో పాటు నందవరం మాజీ సర్పంచ్ రామన్నగౌడు, రాఘవేంద్రస్వామి, శివలతో పాటు మరో 200 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు.

మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం



మంచాలమ్మకు పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం లో వెలసిన గ్రామదేవత మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం శ్రావణమాస తొలి పంచమి శుభదినాన్ని పురష్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, సుగంధ ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకం చేసి పసుపు, గంధం, గాజులు, పట్టుచీర, బంగారు,వెండి ఆభరణాలతో పాటు వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పీఠాధిపతి మహామంగళహారతులు ఇచ్చారు.వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

టీబీ డ్యాం నుంచి నీటి విడుదల కుదింపు

మంత్రాలయం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర నది మరింత ఉగ్రరూపం దాల్చింది. హాస్పేట్ లోని టీబీ డ్యామ్ నుంచి 23 గేట్లను ఎత్తి 99వేల క్యూసెక్కులకు కుదించి నీటిని దిగువనున్న తుంగభద్ర నదికి విడుదల చేశారు. దీంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం వద్ద మంగళవారం సాయంత్రం 311.2 మీటర్ల నీటి మట్టంతో 1,20,200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. సోమవారం సాయంత్రం డ్యాం ఇన్‌ఫ్లో 1,21,980 క్యూసెక్కులుగా ఉంది. ఇప్పటికే తుంగభద్ర నది రెండువైపులా సరిహద్దులను తాకుతూ పరవళ్లు తొక్కుతూ.. నది ఒడ్డున ఉన్న గంగమ్మ గుడిని తాకుతూ ప్రవహిస్తోంది. నది ఒడ్డున ఎస్‌డీఆర్ఎఫ్, పోలీసులు, శ్రీమఠం సెక్యూరిటీ, పుట్టీలు, గజ ఈతగాళ్లతో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. పశువులకాపరులు, చేపలు పట్టేవారు, నదీతీర గ్రామాల రైతులు నదిలోకి వెళ్లొద్దని తెలిపారు.

ప్రైవేటు పాఠశాలలకు నోటీసులు జారీ

మంత్రాలయం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజుల వసూలు, వ్యాపార సంస్థల్లాగా మారి పుస్తకాలు, బ్యాగులు, అమ్ముతూ సొమ్ము చేసుకోవడం, నవోదయ కోచింగ్ సెంటర్లు, డ్యాన్స్ క్లాసుల పేరిట అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, చిన్న చిన్న తరగతి గదుల్లో ఇరుకుగా బోధన కొనసాగిస్తున్నారని నోటీసులు జారీ చేసినట్లు ఎంఈవో షైనుద్దీన్ తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల నుంచి విద్యార్థి సంఘాలు, ధర్నాలు చేయడం సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం, దిష్టిబొమ్మలు దగ్ధం చేయడం వంటివి చేస్తున్నారని, వాటికి స్పందిస్తూ పాఠశాలలో మౌలిక సదుపాయాలు, అనుభవం గల టీచర్లు అన్ని అనుమతులు ఉన్న బస్సులపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, ఇవ్వని పాఠశాలలపై ఉన్నతాధికారులకు క్రమశిక్షణా చర్యలు తీసుకంటామని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని, అతిక్రమించిన పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరద నీటితో మునిగిన పొలాలు

● కడిదొడ్డి - హాల్వికి రాకపోకలు బంద్



కడిదొడ్డి, హాల్వి గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు

కోసిగి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నదీతీర గ్రామమైన కడిదొడ్డి గ్రామంలో తుంగభద్ర నదికి భారీగా వరదనీరు పోటెత్తడంతో గ్రామంలోని పంట పొలాలు, మోటార్లు నీట మునిగాయి. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం నుంచి 27 గేట్లు ఎత్తి 1,15,759 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో మంగళవారం భారీగా వరద నీరు తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టకు పోటెత్తింది. అలాగే తుంగభద్ర నదికి ఆనుకుని ఉన్న కడిదొడ్డి గ్రామంలోని పొలాల్లో సుమారు 80 ఎకరాలకు పైగా నీట మునిగింది. అయితే వరి పైర్లు వేయకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు కడిదొడ్డి గ్రామంలో హాల్వికి వెళ్లే కల్వర్టు రోడ్డు దిగువకు ఉండటంతో పూర్తిగా నీట మునిగి హాల్వి, గుడికంబాలు, వల్లూరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు వరద నీటిలో మునిగిపోవడంతో ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.. వరద పెరిగితే నీళ్లు గ్రామంలోకి వస్తాయని రైతులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరు జూలై 29(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో పారిశుధ్య కార్మికులపై లాఠీచార్జి చేయించిన సీఐ శ్రీనివాసరావుపై చర్యలు తీసుకో వాలని సీఐటీయూ నాయకుడు రాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు పురపాలక సంఘంలో పారిశుధ్య కార్మికులను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ కార్మికులను పర్మినెంట్ చేయాలని పోరాటాలు చేస్తున్న కార్మికులపై నెల్లూరు సీఐ గాయాలు అయ్యేలా లాఠీచార్జి చేయించటం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వంలో కార్మికులపై పోలీసులతో దాడి చేయించడం పరిపాటిగా మారిందని విమర్శించారు. పారిశుధ్య కార్మికు లపై దాడి చేసిన సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. నాయకులు కేసన్న, ఇస్మాయిల్, నాగరాజు, నరసప్ప, ఖాజా, తిక్కయ్య, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు మతి భ్రమించింది




ముగతిలో 'తొలి అడుగు'లో టీడీపీ నాయకులు

నందవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జగన్‌కు మతి భ్రమించి సీఎం చంద్రబాబుపై బురద జల్లే రాజకీయం చేస్తున్నాడని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ ఈరన్నగౌడు మండిపడ్డారు. మంగళవారం మండలంలోని ముగతి, నాగలదిన్నె గ్రామాల్లో మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీ ఆధ్వర్యంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎల్ఎల్‌సీ బోర్డు డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, భార్గవ్‌యాదవ్, అడ్వకేట్ నర్సిరెడ్డి, టౌన్‌బ్యాంక్ ఉపాధ్యక్షుడు నరసప్ప, రంగయ్యశెట్టి, పాల్గొన్నారు.

ఉచితంగా ఆముదాల పంపిణీ

ఎమ్మిగనూరు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు ఉచితంగా ఆముదాలను పంపిణీ చేస్తున్నట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు సబ్ డివిజన్ ఆముదం పంట సాగు చేసే రైతులకు ఆముదాలను అందజేయడం జరుగుతుందన్నారు. కేవీకేలో నవభారత్-7 రకం ఆముదాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు బుధవారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రానికి వచ్చి ఆముదాలను తీసుకెళ్లాలన్నారు.

ట్రైనీ ఎస్ఐగా మల్లికార్జున



ట్రైనీ ఎస్ఐ సల్లా మల్లికార్జున

ఎమ్మిగనూరు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు రూరల్ ట్రైనీ ఎస్ఐగా సల్లా మల్లికార్జున బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ 2024-25 బ్యాచ్‌కు చెందిన తాను ఏడాది పాటు అనంతపురంలో ట్రైనింగ్ తీసుకుని, అక్కడి నుంచి బెటాలియన్‌తో పాటు పార్వతీపురంలో పనిచేసి ట్రైనింగ్ నిమిత్తం ఎమ్మిగనూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు రావడం వచ్చారు. ప్రస్తుతం రూరల్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో శాంతిభద్రతల పర్యవేక్షణలో శిక్షణ తీసుకుంటానన్నారు.

బైకు అదుపు తప్పి యువకుడికి గాయాలు

కోసిగి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామానికి చెందిన కురువ నాగరాజు, అశోక్ అనే ఇద్దరు యువకులు కోసిగి మీదుగా బైక్‌పై మంత్రాలయం వెళ్తుండగా.. డి.బెళగల్ గ్రామ సమీపంలోని శ్రీమారెమ్మ దేవాలయం ఎదుట గల కల్వర్టు వద్ద బైక్ అదుపు తప్పి కిందకు పడటంతో కురువ నాగరాజు అనే యువకుని తలకు, చేతులకు తీవ్రమైన గాయాలయ్యాయి. అశోక్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు 108కి సమాచారం అందించిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని 108 సిబ్బంది రామకృష్ణ, గాయపడిన వారికి అక్కడే ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.